T.T.D. Religious Publications Series No. 936
Price :

Published by **Sri M.G.Gopal,** I.A.S., Executive Officer,
T.T.Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

"తిరుమలక్షేత్రదర్శిని" గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం

డా॥ కె.వి. రాఘవాచార్య

**తిరుమల తిరుపతి దేవస్థానములు,**
**తిరుపతి.**

“తిరుమలక్షేత్రదర్శిని” గ్రంథమాల

# శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం


రచన

డా॥ కె.వి. రాఘవాచార్య



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు తిరుపతి

**2014**


## SRI VENKATESWARA SWAMY BRAHMOTSAVAM


**By**
**Dr. K.V. Raghavacharya**



T.T.D. Religious Publications Series No.936


© All Rights Reserved



*First Edition:- 2013*

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by :*
**M.G.GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

***D.T.P:***
Office of the Editor-in-Chief,
T.T.D, Tirupati.

*Printed at :*
Tirumala Tirupati Devasthanams Press,
Tirupati - 517 507

# ముందుమాట

**“వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో న భూతో న భవిష్యతి”**

వేంకటాద్రికి సమానమైన మరో క్షేత్రం ఈ బ్రహ్మాండంలోనే లేదు. వేంకటేశ్వరునికి సాటి రాగల దేవుడు ఇంతవరకు ఎక్కడా లేదు. ఇక మీదకూడ ఉండడు – అని అర్థం.

కలియుగవైకుంఠంగా భాసిల్లే శ్రీవేంకటాద్రిపై అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామి అవతరించి నిత్యమూ భక్తులకు దర్శనమిస్తూ వారిని తరింపజేస్తున్నాడు. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహమూర్తిని ఒక్క క్షణకాలమైనా దర్శించుకొని తరించడానికి వేలకొద్దిమంది భక్తులు నిత్యమూ ఈ క్షేత్రానికి యాత్ర చేస్తుంటారు.

పిలిస్తే పలికే ప్రత్యక్షదైవమూ, కోరిన వరాలరాయడూ ఐన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన ఈ క్షేత్రంలోని స్వామి దివ్యమంగళ విగ్రహం, స్వామి పుష్కరిణి, పవిత్రతీర్థాలు, స్వామికి అతివైభవంగా జరిగే నిత్యకైంకర్యాలు, స్వామి బ్రహ్మోత్సవాలు మొదలైన విశేషాలు భక్తులకు తెలియజేయాలనే సంకల్పంతో తిరుమల తిరుపతి దేవస్థానం **‘తిరుమల క్షేత్రదర్శిని’** అనే పేర ఒక గ్రంథమాలను ప్రారంభించి, ఆ యా పండితులచేత గ్రంథాలను రాయించి ప్రకటించాలని తలపెట్టింది.

ఈ గ్రంథాలలో ప్రస్తుతం డా॥ కె.వి.రాఘవాచార్యగారు రచించిన **‘శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం’** అన్న ఈ గ్రంథాన్ని భక్తులకు అందజేస్తున్నాం. భక్తు లీ గ్రంథం ద్వారా వైఖానసఆగమం ప్రకారం శ్రీ స్వామివారికి జరిగే బ్రహ్మోత్సవాలను గూర్చి వివరంగా తెలుసుకొని ధన్యత నొందుదురుగాక అని ఆకాంక్షిస్తున్నాము.

సదా శ్రీవారి సేవలో....

కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం

**శ్రీలతకుంభ్రాకయి వృష**
**శైలంబున వెలసి తనదు చాయ కెలయు ధ**
**న్యాళి దగమాన్చి కోర్కులు**
**చాలంగా నొసగు కల్పసాలము గొలుతున్॥**

తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి జరిగే నిత్యవార పక్ష మాస వార్షికోత్సవాలలో అత్యంత ప్రధానమైనది బ్రహ్మోత్సవం. ఇది శ్రీనివాసుడు వేంకటాద్రిపై అవతరించిన సౌరమాన కన్యామాసంలో (సూర్యుడు కన్యారాశిలో సంచరించుచున్నపుడు) శ్రవణానక్షత్రం (శ్రీవారి అవతార నక్షత్రం) నాడు అవభృథం నిర్ణయించి నవాహ్నికంగా (తొమ్మిది రోజులు) జరుపబడుచున్నది.

ఉత్సవం (ఉత్+సవం) అనగా గొప్ప యజ్ఞం అని అర్థం. యజ్ఞం పూర్తియగుటను సూచించుటకు యజ్ఞాంతమున యజమాని అవభృథస్నానం చేస్తాడు. అట్లాగే ఉత్సవం కడపటిరోజున చక్రస్నానం జరుపబడుతున్నది. దేవునికి ఉత్సవం లోకక్షేమం కొరకు, సమస్త అశుభముల నివారణకొరకు, సకల శుభముల ప్రాప్తికొరకు జరుపబడుచున్నది. అంతేగాక, ఆలయాల్లో కొన్ని సమయాల్లో సంప్రదాయానుసారం ప్రవేశించుట కొందరికి నిషేధం. అందువల్ల అటువంటి వారికోసం ఊరేగింపులనెపంతో స్వామివారు ఆలయం బయటికి ఉత్సవంగా వస్తారు. అలాంటి ఉత్సవాలలో దేవునికి వివిధములైన, అమూల్యమైన ఆభరణములతో విశేషాలంకారం, వివిధ వాహనసేవలు జరుపబడుతాయి. ఆ వైభవాన్ని

చూచి తరించుటకు భక్తులు అసంఖ్యాకంగా వస్తారు. ఉదారులైన ధనవంతులకు యాత్రికులకు ఆహారవసతి సౌకర్యములు కలిగించుట ద్వారా మాధవసేవ చేసే అవకాశం లభిస్తుంది. సజ్జనులు దానధర్మాలు చేసి తరిస్తారు. పూజలు ఉత్సవాలు సక్రమంగా శాస్త్రీయంగా నిర్వహించుట వలన అర్చామూర్తిలో వుండే అనుగ్రహశక్తి అభివృద్ధిచెందుతుంది. భక్తులు అభీష్టసిద్ధిని పొందుతారు. కృతార్థులవుతారు.

తొల్లి కలియుగ ప్రారంభంలో జంబూ ద్వీపమందలి భారతదేశంలోని గంగానదికి దక్షిణ దిక్కున రెండువందల యోజనముల దూరాన, తూర్పుసముద్రమునకు పడమట అయిదు యోజనాల దూరాన, నారాయణ పర్వతంపై స్వామిపుష్కరిణి తీరానికి పడమట కన్యాభాద్రపదమాసం ఏకాదశి సోమవారం శ్రవణా నక్షత్రం కూడిన సిద్ధయోగ శుభసమయాన దేవతా సమూహంచే ప్రార్థింపబడి, లోకరక్షకుడు, పరమపురుషుడు అగు శ్రీనివాసభగవానుడు అవతరించెనని పద్మపురాణం అభివర్ణించింది. (33-124-127 శ్లో॥)

**లోకవినుతమైన వైకుంఠనగరి**
**మాని నుతవిహారి మాయదారి**
**శౌరి రమయు దాను స్వామిపుష్కరిణీ**
**తటిని నధివసించు వినుతలీల॥**

లోక ప్రసిద్ధమైన వైకుంఠనగరమును వదిలిపెట్టి ప్రస్తుతింపదగిన లీలలు గలవాడు, మాయదారి యగు విష్ణువు లక్ష్మీదేవితో స్వామి పుష్కరిణీ తీరమున వెలసియున్నాడు.

వైకుంఠాన్ని విడిచిపెట్టి లోకహితం కోరి వేంకటాద్రిపై వెలసిన శ్రీనివాసభగవానుని వెదుకుతు బ్రహ్మాది దేవతలు అక్కడికి చేరుకున్నారు. భగవంతుని దర్శించి, ఆనందించారు. లోకకల్యాణార్థం మానవ భక్తులను



తరింపజేయడానికి శ్రీమన్నారాయణుడు నారాయణగిరిపై వెలసిన శుభ సంఘటనను పురస్కరించుకొని బ్రహ్మదేవుడు విష్ణుదేవునికి నమస్కరించి.

**ధ్వజసమారోపణము దొల్త దగు మహోత్స**
**వంబు సేయంగ నభిలాష వరలె నాకు**
**నేతదుత్సవమునకు నీ వియ్యకొనుము**
**కమలవాసినితో గూడి కమలనాభ॥**

ఓ శ్రియఃపతీ! ధ్వజారోహణ పూర్వకంగా నీకు మహోత్సవం చేయవలెనను కోరిక గలిగింది. ఆ ఉత్సవానికి అంగీకరింపుము. లక్ష్మీదేవితో కూడ మీరు పాల్గొనవలసినదిగా ప్రార్థించుచున్నాను అని విన్నవించినాడు. అందుకు లక్ష్మీనారాయణుడు అంగీకరించాడు. ఇట్లు శ్రీనివాసభగవానుని అనుమతితో తిరుమలలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమైనాయి.

## బ్రహ్మోత్సవ నిర్వచనాలు

అంత సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడు సౌరమానరీత్యా సూర్యుడు కన్యారాశిలో సంచరించుచున్నప్పుడు (చాంద్రమాన ఆశ్వయుజమాసంలో) శ్రీనివాస భగవానుని అవతారనక్షత్రమగు శ్రవణానక్షత్రంనాడు అవభృథం నిర్ణయించి, శుక్లవిదియ హస్తానక్షత్రంనాడు అంకురార్పణంచేసి, దేవఋషులయిన విఖనస, భృగు, మరీచ్యాది మహర్షులను ఋత్విక్కులుగా ఆమంత్రణంచేసి, వారి సహాయంతో చిత్తనాటి ఉదయం ధ్వజారోహణం నిర్వహించి నవాహ్నికంగా మహోత్సవం నిర్వహించినాడు. అదియే ఈ నాటి బ్రహ్మోత్సవానికి నాంది.

ఈ సంఘటన యథార్థమని తెలుపుతూ నేడూ తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి కన్యామాసంలో శ్రవణానక్షత్రంనాడు అవభృథం

(చక్రస్నానం) నిర్ణయించి, అంతకుముందు ఎనిమిది రోజులనుండి ధ్వజారోహణంతో ప్రారంభించి నవాహ్నికంగా (తొమ్మిదిరోజులు) బ్రహ్మోత్సవం - (బ్రహ్మ ప్రారంభించిన మహోత్సవం) పేరుతో శ్రీ వేంకటేశ్వరస్వామి అవతార శుభదినాన్ని నక్షత్రాన్ని గుర్తు చేస్తూ నిర్వహించడం జరుగుతున్నది.

తరిగొండ వేంగమాంబ తన వేంకటాచల మాహాత్మ్య, పద్య కావ్యంలో బ్రహ్మోత్సవ కార్యక్రమాన్ని ఇట్లు వర్ణించింది.

**"..................కన్యారాశియందు సూర్యు**
**డమర ప్రవేశించినట్టి మాసమున జి**
**త్రాఖ్య నక్షత్రంబునందు శాస్త్ర**
**మభిమతంబుగ సద్ధ్వజారోహణము చేసి**
**యుత్తరాషాఢ రథోత్సవంబు**
**గావించి, శ్రవణనక్షత్రమందే తీర్థ**
**వారి జేయింపగా వలయు"** 2-120

సూర్యుడు కన్యారాశిలో సంచరించుచున్నప్పుడు చిత్తానక్షత్రంనాడు ధ్వజారోహణం, ఉత్తరాషాఢ నక్షత్రంనాడు రథోత్సవం, శ్రవణానక్షత్రం నాడు తీర్థవారి (చక్రస్నానం, అవభృథం) చేయింపవలయును. ఈనాడు కూడ శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవ కార్యక్రమం చిత్రానక్షత్రం నాడు (18-09-2012) ధ్వజారోహణం, ఉత్తరాషాఢ నక్షత్రం నాడు (25-09-2012), శ్రవణానక్షత్రం నాడు (26-09-2012) చక్రస్నానం - మునుపటివలెనే జరుపబడుచున్నవి. అహో! సంప్రదాయ బలిమి! బ్రహ్మ ప్రారంభించిన ఉత్సవం బ్రహ్మోత్సవంగా ప్రసిద్ధమయింది.

"ఋతగ్ం సత్యం పరబ్రహ్మ, ఏకమేవాఽద్వితీయం బ్రహ్మ, నారాయణం పరబ్రహ్మ" అను వేదవాక్యాలచే నారాయణ శబ్దవాచ్యుడే



పరబ్రహ్మ. ఆ బ్రహ్మకు (పరబ్రహ్మయగు నారాయణుని అర్చావతారమే శ్రీనివాసుడు/వేంకటేశ్వరుడు) జరుపబడుచున్న మహోత్సవమే బ్రహ్మోత్సవం. ఇది సృష్టికర్తయగు బ్రహ్మ యాజమాన్యమున ప్రారంభింపబడిన ఉత్సవంగనుక బ్రహ్మోత్సవం అని పిలువబడుచున్నది. ఈనాటికీ తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మదేవుని మార్గదర్శకత్వంలోనే జరుగుచున్నవని తెలియజేయుచూ శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పగలు, రాత్రి జరిగే వాహనాల ఊరేగింపులకు ముందు శోభాయమానంగా అలంకరించబడిన ఒక చిన్న రథం- బ్రహ్మ రథం- సాగుతుంటుంది. ఈ రథంలో నిరాకార, నిర్గుణ స్వరూపంతో బ్రహ్మదేవుడు అధివసించి ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటాడు. అయితే ఒక్క రథోత్సవం నాడు మాత్రం ఊరేగింపుకు ముందు బ్రహ్మరథం వుండదు. ఎందుకనగా, శ్రీ వేంకటేశ్వరస్వామి శ్రీమన్నారాయణుని అర్చావతారం. కనుక శ్రీవారి రథోత్సవంనాడు బ్రహ్మదేవుడే రథసారథి యై స్వయంగా శ్రీ వేంకటేశ్వరస్వామివారి తేరుపగ్గాలను పట్టుకొని రథాన్ని నడుపుతుంటాడు. అదృశ్యంగా బ్రహ్మదేవుడు రథోత్సవంలో పాల్గొంటాడు.

## తొమ్మిదిరోజుల ఉత్సవం బ్రహ్మోత్సవం:

**నవమం నవరత్నం చ బ్రహ్మ చ కమలాసనః**
**నిధిః గ్రహాశ్చ ఖండం చ రంధ్రో భావశ్చ లబ్ధకః॥**

నవమం, నవరత్నం, బ్రహ్మ, కమలాసనః, నిధిః, గ్రహః, ఖండః, రంధ్రః, భావః, లబ్ధకః, ఈ పదిన్నీ తొమ్మిది సంఖ్యకు పేర్లు అని సంజ్ఞా నిఘంటువు. కనుక బ్రహ్మ అనే పదం నవబ్రహ్మలను బట్టి తొమ్మిది సంఖ్యను తెలియజేస్తుంది. శ్రీ వేంకటేశ్వరస్వామికి బ్రహ్మ జరిపిన మహోత్సవం ధ్వజారోహణంనుండి ధ్వజావరోహణం వరకు తొమ్మిదిరోజులు జరిగింది. కనుక తొమ్మిదిరోజులపాటు జరిగే ఈ మహోత్సవానికి బ్రహ్మోత్సవం అను

ప్రసిద్ధి గలిగింది. తొమ్మిది రోజులు జరిగే మహోత్సవానికి బ్రహ్మోత్సవం అను పేరు సార్థకంగా వుంది.

తిరుమలలో ఈ వార్షిక బ్రహ్మోత్సవం గాక ఒక్కరోజు జరిగే బ్రహ్మోత్సవాలు మూడు ఉన్నాయి. రథసప్తమి నాడు ఆర్షము, కైశిక ద్వాదశినాడు రాక్షసం, ముక్కోటి ఏకాదశినాడు దైవికం అనుపేరుగల బ్రహ్మోత్సవాలు జరుగును.

బ్రహ్మ జరుపుచున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి మహోత్సవానికి దేవతలందరు, దేశప్రజలందరు దేశప్రజలందరు ఆహ్వానింపబడినారు. ఇంద్రాది దిక్పాలకులు తమ తమ వాహనాల నెక్కి, ప్రయాణంచేసి వేంకటాద్రి చేరినారు. ధర్మనిరతులగు భారతదేశంలోని రాజులందరు వచ్చారు. దేశంలోని, అన్ని ప్రాంతాల నుండి భక్తులు, పరుసజనం గోవిందా! గోవిందా! అని దైవనామస్మరణం చేస్తూ వేంకటాద్రి చేరారు. యోగివరులకైనా కనులకు కనిపించని పరాత్పరుడగు శ్రీనివాసుడు సర్వప్రాణులయందు దయ గలిగి ప్రత్యక్షంగా కనిపించినాడు. ఉత్సవంలో పాల్గొన్నాడు. బ్రహ్మ విశ్వకర్మను రావించి, అతనిచే మహోత్సవ దర్శనంకోసం తిరుమల వచ్చువారందరికి కొండచుట్టూ విడిది గృహాలను, సత్రాలను, చలివేంద్రలను ఏర్పాటు చేయించాడు. ఆహ్వానితులకు, అతిథులకు, భక్తులకు, యాత్రికులకు సకల సౌకర్యాలు కలిగించాడు. మహోత్సవానికి వచ్చిన వారందరు.

**అంగీచకార విధినా నిర్మితం చ మహోత్సవం**
**ఉత్సవే దర్శనం పుణ్యం శ్రీనివాసస్య శార్జ్గిణః ॥**

శ్రీనివాసుడు మహోత్సవం జరుపుటకు సమ్మతించినాడు. బ్రహ్మ ఉత్సవంను చక్కగా నిర్వహించుచున్నాడు. ఉత్సవ దినాలలో ధనుర్ధారియగు శ్రీనివాసుని దర్శనం పుణ్యప్రదమని కీర్తించారు. మహోత్సవం కొరకు



తిరుమల మాడవీథులన్నియు జెండాలతో, తోరణాలతో, పూలమాలలతో, అరటిచెట్లతో సుందరంగా కనులపండువుగా అలంకరింపబడినాయి. మహర్షులు యాగశాలలో వేదమంత్రాలతో హోమాలు చేయుచుండిరి. బ్రహ్మదేవుడు శ్రీనివాస పరబ్రహ్మను కుబేరుడు సమర్పించిన దివ్యాభరణాలతో అలంకరించినాడు. విశేషార్చనలు చేసినాడు. ఘృత సూపాలతో సంస్కరించిన గుడాన్నం, ముద్గాన్నం, మధురాన్నం, తిలాన్నం, మాషాన్నం, దధ్యన్నాలను ఆరు రుచికరాలైన అన్న ప్రసాదాలను తిలాపూప మాషాపూప, మనోహర, మోదకం మున్నగు భక్ష్యాలతో నానారకాలైన ఫలాలతో స్వాదువులు, అమృతకల్పం మున్నగు వ్యంజనాదులతో కూడిన నానావిధాలైన నైవేద్యాలను బ్రహ్మ శ్రీనివాసునికి ఘనంగా, విశేషంగా సమర్పించినాడు. అవి అన్నియు భగవంతునికి నివేదించిన తర్వాత భక్తులకు ప్రసాదంగా నొసంగబడినాయి.

ఒక దినం ఉచ్చైఃశ్రవం అను గుర్రంపై, ఒక దినం ఐరావతం అను ఏనుగుపై, ఒక దినం ఆదిశేషునిపై, ఒక దినం బంగారు పల్లకిపై ఇట్లు ఒక్కొక్కనాడు ఒక్కొక్కవాహనంపై శ్రీదేవి, భూదేవులతోకూడి శ్రీనివాసభగవానుడు అధిరోహించి తిరువీథులలో భక్తజనులకు కనువిందుచేయుచు విహరించినాడు. ఆ మహోత్సవం జూచు వేడుకతో వచ్చిన మానవ, దేవతాది భక్తజనులను కృపాదృష్టితో అనుగ్రహించినాడు. వాహనసేవలకు ముందు తంత్రీవాద్యాలతో, తాళవాద్యాలతో చెవులకు ఇంపుగా గంధర్వులు పాటలుపాడినారు. నృత్య వాద్యాలతో అప్సరస్త్రీలు నాట్యం చేసినారు. వంది, మాగధులు శ్రీనివాసుని వైభవాన్ని ఎలుగెత్తి కీర్తించారు. ధనవంతులగు భక్తులు యాత్రికులకు అన్నదానం, వస్త్రదానం చేసినారు. ఆర్యులకు సువర్ణదానం, గృహదానం, భూదానం చేసి తరించారు. బ్రహ్మ నిర్వహించిన మహోత్సవ దినాలు పుణ్య ప్రదాలని పాపనాశకరాలని,

శ్రీనివాసుని ప్రత్యక్షంగా దర్శించి ధన్యులయినామని భక్తజనులు సంతోషించారు. బ్రహ్మదేవుని కొనియాడినారు.

ఈ విధంగా మూడుపూటల నైవేద్యాలతో రోజుకు రెండుపూటల వాహన సేవలతో కడు వైభవంగా బ్రహ్మ నిర్వహించిన మహోత్సవానికి శ్రీనివాసుడు సంతోషించి

**కమలజ! నీ సంకల్పము**
**క్రమముగ ఫలియించె, మోదకలితుడనైతిన్**
**సుమహితముగ నీ యుత్సవ**
**మమరగ బ్రహ్మోత్సవాఖ్య నవనిన్ వెలయున్ ॥**

–బ్రహ్మ! నీ సంకల్పం చక్కగ నెరవేరింది. నేను సంతోషించితిని. ఈ మహోత్సవం ఇక మీదట 'బ్రహ్మోత్సవం' అను పేరుతో ప్రసిద్ధమౌతుంది. నీవు నిర్వహించిన రథోత్సవాన్ని భక్తితో చూచినవారు దుస్తరమైన సంసారసముద్రాన్ని దాటి, జన్మరహితులై సుఖింతురు. వారి నందరిని నేను కరుణతో కాపాడుతుంటాను. ఎంత నమ్మిన వారికి అంత ఫలం లభిస్తుంది.

**ఈ సవంబున భక్తితో నెవ్వరైన**
**నన్న వస్త్రార్థగృహ పాత్ర లార్యజనుల**
**కొనరగా దానములు సేయుచున్న ధన్యు**
**లనుభవింతురు భాగ్యంబులవనియందు ॥**

– ఈ బ్రహ్మోత్సవమను యజ్ఞంలో భక్తితో ఎవ్వరు పూజనీయులగు, భక్తులకు అన్నం, వస్త్రం, ధనం, గృహం, పాత్రలు మొదలగునవి దానం చేస్తారో వారు (దాతలు) ధన్యులై, ధనవంతులై సుఖసంపదలతో కూడిన



అభ్యుదయ జీవితాన్ని అనుభవిస్తారు. అని పలికి బ్రహ్మనుచూచి ఒక వరము కోరుకొనుమనగా బ్రహ్మ శ్రీనివాసునకు నమస్కరించి.

**దేవ యిందరికిని దృశ్యుండవగుచు**
**శ్రీ వేంకటాచలశిఖరంబు నందె**
**యీ లాగు ప్రతివర్ష మిమ్మహోత్సవము**
**చాల గైకొనుచు బ్రసన్నత మెరయ**
**వరదుడవై ఎల్లవారి రక్షింప**
**గరుణ జేయుచు నుండగావలె నిదియె.**

–దేవా! అందరికిని కనిపించుచు ఈ వేంకటాచలం నందే నివసించు. ఇట్లే ప్రతి సంవత్సరం ఈ మహోత్సవాన్ని అంగీకరించి, చేయించుకొనుము. ప్రసన్నుడవై, వరదుడవై ప్రజలందరికిని కనిపించుచు వారిని కరుణతో రక్షించుచుండుము. ఇదే నా కోరిక. అనుగ్రహింపుము అని ప్రార్థించాడు. బ్రహ్మ కోరికను అనుగ్రహించి, శ్రీనివాస భగవానుడు.

**పంకజాసన! నీవు ప్రార్థించినటుల**
**వేంకటగిరియందె విహరింతు నెపుడు**
**సకలలోకములకు సాక్షాద్భవించి**
**ప్రకటితసర్వసంపదల నొసంగుదును**

– బ్రహ్మ ! నీవు ప్రార్థించినట్లే నేను వేంకటాద్రియందే నివసిస్తాను. ప్రజలందరికి కనిపిస్తూ వారిని దయతో రక్షిస్తాను. వారికి సకల సంపదలు అనుగ్రహించి సుఖముగా జీవించున్నట్లు చేస్తాను. అని వరం అనుగ్రహించినాడు. ఆ మాట ప్రకారం శ్రీనివాసుడు (వేంకటేశ్వరుడు) ఆశ్రితభక్తవరదుడై కలియుగాంతం వరకు తిరుమల యందు

నివసించియుండును. లోక కల్యాణార్థం అర్చామూర్తిగా శ్రీమన్నారాయణుని అవతరింపజేసి, ఆరాధనాంగంగా ఉత్సవాదులను ఏర్పాటు చేసిన బ్రహ్మ చేసిన ఘనకార్యాన్ని గుర్తుకు తెస్తూ శ్రీ వేంకటేశ్వర అష్టోత్తర శతనామావళిలో "ఓం బ్రహ్మకృతోత్సవాయ శ్రీ వేంకటేశాయ నమః (49) - బ్రహ్మచే ఏర్పాటు చేయబడిన మహోత్సవాదులను స్వీకరించిన శ్రీ వేంకటేశునకు నమస్కారం అనే నామం చేర్చబడింది. బ్రహ్మ ధన్యజీవి, కృతార్థుడు అయినాడు.

సృష్టికర్త బ్రహ్మ నిర్వహించిన శ్రీనివాసుని మహోత్సవాన్ని వేడుకతో చూచుటకు వచ్చిన దేవతలు, మహర్షులు, ప్రజలందరు

**"ఏమి తపంబొనర్చితిమొ యే సుకృతం బొనరించినామొ యే**
**నోములు నోచినారమొ మనోరథముల్ మది దైలువారగా**
**గామిత దానపాటవము గల్గిన తండ్రిని వేంకటాచల**
**స్వామిని జూడగంటిమి శుభమ్ములుగూడ, నఘమ్ములూడగన్॥"**

-మనం పూర్వజన్మలో ఏ తపస్సుచేసినామో, ఏ పుణ్యకార్యం చేసినామో, ఏ నోములు నోచినామో మన కోరికలు సంపూర్ణంగా ఫలింపజేయు శక్తి గలిగిన తండ్రిని, పాపాలు నశించి, శుభాలు గలుగునట్లు వేంకటాచలపతిని కన్నులార చూడగల్గితిమి అని తలంచి శ్రీనివాసునికి వీడ్కోలు చెప్పి, స్వామి అనుమతిని పొంది స్వ స్థానాలకు వెళ్ళినారు.

## బ్రహ్మోత్సవ చరిత్ర

చారిత్రకంగా క్రీ.శ.10వ శతాబ్దంలో తిరుమల ఆలయంలో వేసిన ఒక తమిళ శాసనంలో మొదటి సారిగా తిరువేంగడనాథుని బ్రహ్మోత్సవాల ప్రస్తావన వుంది. నేడు శ్రీ వేంకటేశ్వరస్వామి యొక్క కౌతుకమూర్తిగా,



ప్రతినిధిగా నిత్యమూ అభిషేకం, ఏకాంతసేవ, సహస్ర కలశాభిషేకం మున్నగు సేవలను జరిపించుకొంటున్న భోగశ్రీనివాసమూర్తి (మనవాళప్పెరుమాళ్) వెండివిగ్రహాన్ని శక్తి విటంకన్ అనే పల్లవ రాజ్యాధికారి భార్య సామవై పెరుందేవి శ్రీవారికి కానుకగా సమర్పించి, అక్షయ నామ సంవత్సర జ్యేష్ఠబహుళ తదియ శుక్రవారం, శ్రవణా నక్షత్రంనాడు (8-06-966 తేది) తిరుమల దేవాలయంలో తిరువిలాన్‌కోయిల్ (నేటి స్నపన మండపం) నిర్మించి, ప్రతిష్ఠించింది. (శాసనం 1-8,9, తి.తి.దే., శాసనాలు, 1988) సామవై పెరుందేవి (ఈమె పేరుతో తిరుమలలో పెరుందేవి తోట వున్నది) పెరటాసి నెలలో (కన్యా ఆశ్వయుజమాసంలో) చిత్తానక్షత్రం నాడు ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు తాను సమర్పించిన భోగశ్రీనివాసమూర్తిని ఉత్సవమూర్తిగాజేసి ఉత్సవాలను జరిపించాలని కోరింది. సామవై పెరుందేవి భోగ శ్రీనివాసమూర్తికి అమూల్యమైన కెంపులు, పచ్చలు, ముత్యాలు, జాతిరత్నాలు పొదిగిన కిరీటం, మకర కుండలాలు, హారాలు, కేయూరాలు, కంకణాలు, బంగారువడ్డాణం మొలనూలు, ఉదరబంధం మొదలగు ఆభరణాలను సమర్పించింది. ఈ ఉత్సవమూర్తి నైవేద్యాలకు, ఉత్సవ నిర్వహణకు పెరటాసి, మార్గళి (ముక్కోటి ఏకాదశి) నెలల్లో జరిగే బ్రహ్మోత్సవాలకు 4177 కుళీల పంటభూమిని సమర్పించింది. ఈ దాన శాసనం చివరలో "యెన్ ఇత్తన్‌మం ఇరక్షిప్పార్ శ్రీపాదం ఎన్‌తలైమెలదు" (ఈ దాన ధర్మాలను కాపాడు వారి శ్రీపాదాలను నేను శిరసావహిస్తాను) దీనిని శ్రీవైష్ణవులు రక్షించుదురుగాక! అని కోరింది. ఎంత ఔదార్యం! ఆ చల్లని తల్లి కోరిక ఆదర్శప్రాయం గదా! క్రీ.శ.966 నాటి సామవై పెరుందేవి శాసనాలు తిరుమల శ్రీవారి ఆలయం మొదటి ప్రాకారం ఉత్తరపు గోడపై చెక్కబడియున్నవి. సామవై పెరుందేవి దాన శాసనం వలన క్రీ.శ. 10 శతాబ్దంలో తిరుమలలో 11 రోజులపాటు బ్రహ్మోత్సవం (ప్రధాన ఉత్సవం)

(9రోజులు) జరుగుతుండేదని తెలుస్తున్నది. అయితే ఆలయ అధికారులు, అర్చకులు భోగశ్రీనివాసమూర్తి విగ్రహాన్ని కౌతుక మూర్తిగ (మూలమూర్తికి ప్రతినిధిగ) ఉగ్రశ్రీనివాసమూర్తిని (స్నపనబేరం) ఉత్సవమూర్తిగ ఉపయోగించారు. సామవై కోరిక నెరవేరలేదు. క్రీ.శ. 1339 నుండి మలయప్ప కోనలో లభించిన మలయప్పస్వామిని ఉత్సవమూర్తిగ ఉపయోగిస్తున్నారు. ఇప్పుడు శ్రీదేవి, భూదేవీ సహితుడైన మలయప్పస్వామికే నిత్య కల్యాణోత్సవాలు, ఇతర ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు, ఊరేగింపులు జరుగుతున్నాయి.

శ్రీ వేంకటేశ్వరస్వామికి క్రీ.శ. 14 శతాబ్దం వరకు రెండు (పెరటాసి,మార్గళి నెలల్లో) బ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. క్రీ.శ. 1300 సంవత్సరంలో తిరువేంకటనాథయాదవరాయని కాలంలో రాచయదండ నాయకుని పేరుమీద సింగమదండనాయకుడు ఆడి (ఆషాడం) తిరునాళ్ళు ఏర్పాటు చేశాడు. ఇందుకుగాను ఇల్లత్తూరునాడు లోని పొంగళూరు గ్రామాన్ని సర్వమాన్యంగా దానం చేశాడు (శాసనం: 1-99, తి.తి.దే శాసనాలు, 1998) క్రీ.శ. 13-01-1388 నాడు విజయ నగర ప్రభువు రెండవహరిహరరాయలు మాసి (మాఘమాసం) తిరునాళ్ళను నిర్వహించడానికి పూంగోడు గ్రామాన్ని దానం చేశాడు. ఈ గ్రామంపై వచ్చు ఆదాయంలో బ్రహ్మోత్సవాన్ని జరుపుకార్యభారాన్ని ముల్లై తిరువేంకట జీయరు వహిస్తాడని శాసనం తెలియజేస్తున్నది. (శాసనం 1-185) రెండవ దేవరాయలు 5-2-1429 తేదీన మూడుగ్రామాలు, 2200 పొన్నులు ఉత్సవనిర్వహణకు, నైవేద్యాలకు దానం చేశాడు. ఈ ఉత్సవం అల్పిశి (ఆశ్వయుజమాసంలో)లో పునర్వసునక్షత్రం రోజునుండి స్వాతినక్షత్రం రోజువరకు (9 రోజులు) జరుగుతుంది. స్వాతి నక్షత్రంనాడు చక్రస్నానం జరుగుతుంది. (శాసనం. 1-192) శ్రీవేంకటేశ్వరస్వామికి క్రీ.శ.15 శతాబ్దంలో ఏడు బ్రహ్మోత్సవాలు జరుగుతుండేవి. అవి చిత్రి, ఆడి, ఆవణి,



పెరటాసి, అల్పిసి, మాసి, పంగుణి నెలల్లోజరిగేవి. ఈ ఏడు బ్రహ్మోత్సవాలలో చక్రస్నానంరోజున శ్రీ వేంకటేశ్వరస్వామికి అనంతశయనారు అనుభక్తుడు నైవేద్యాలు ఏర్పాటు చేశాడు. (శాసన: 1-213 తేది: 15-02-1445) శ్రీ వైష్ణవమతం ద్రవిడదేశం నుండి తెలుగు దేశానికి వ్యాపించింది. కనుక తిరుమలలో, శ్రీవైష్ణవదేవాలయాలలో ద్రావిడ ప్రాంతీయ సంప్రదాయాలను అనుసరించి కొన్ని ఉత్సవాలు సౌరమానం ప్రకారం జరుపబడుతున్నాయి. అయితే కొలువు మొదలగు నిత్యకార్యక్రమాలు, కొన్ని ఉత్సవాలు తెలుగువారి సంప్రదాయం అయిన చాంద్రమానం పంచాంగం అనుసరించి జరుపబడుతున్నాయి.

తాళ్ళపాక పెద తిరుమాలాచార్యులు (అన్నమాచార్యుల కుమారుడు) రెండు వేల వరహాలను శ్రీవారి భండారానికి సమర్పించి తనపేర ఆణి నెలలో (జ్యేష్ఠమాసం) 13 రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాన్ని (ప్రధాన ఉత్సవం 11 రోజులు) ఏర్పాటు చేశాడు. (దానశాసనం: 4-129 తేది: 7-3-1539) ఈ బ్రహ్మోత్సవం జ్యేష్ఠమాసంలో (ఆణినెలలో) శ్రవణా నక్షత్రంనాడు ప్రారంభమై మృగశిర నక్షత్రం (తిరుమలాచార్యుని జన్మ నక్షత్రం) నాడు చక్రస్నానంతో ముగిసేది. విజయనగరప్రభువు సదాశివరాయల కాలంలో రాయసంవేంకటాద్రి అనేభక్తుడు తిరుమలలో జరిగే పది బ్రహ్మోత్సవాలలో కొలువు శ్రీనివాసమూర్తికి (అళగప్పిరానారు) నైవేద్యాలు ఏర్పాటుచేసి 700 రేఖైపొన్నులు ఆదాయంవచ్చే దేసూరు గ్రామాన్ని, 200 రేఖైపొన్నులు ఆదాయం వచ్చే వేలాంజినేడు గ్రామాన్ని, 130 రేఖైపొన్నులు ఆదాయంవచ్చే సగం తిమ్మసముద్రం గ్రామాన్ని - మొత్తం 1030 రేఖై పొన్నులు ఆదాయం వచ్చే 21/2 గ్రామాలను - శ్రీ వేంకటేశ్వరస్వామికి దానంగా సమర్పించి 8-7-1551నాడు శాసనం (5-129) వేయించాడు. ఆ సందర్భంలో ఎవరెవరు ఏ ఏ నెలల్లో జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేసింది, వాటి వివరాలు ఆ శాసనంలో తెలిపినాడు. ఆ వివరాలు ఇట్లున్నవి-

| క్రమ సంఖ్య | ఏర్పాటుచేసిన దాత | బ్రహ్మోత్సవం |
|---|---|---|
| 1. | తిరునిన్ర ఉర్‌డైయార్లు (తిరుమల ఆలయఅధికార్లు) | ఆవణి బ్రహ్మోత్సవం |
| 2. | సామవై పెరుందేవి (బ్రహ్మదేవునిపేరున) (శక్తి వికంటకన్ భార్య పల్లవరాణి) | పెరటాసి బ్రహ్మోత్సవం |
| 3. | దేవరాయమహారాయలు | పెరటాసి బ్రహ్మోత్సవం |
| 4. | బుక్కరాయ మహారాయలు | కార్తికి బ్రహ్మోత్సవం |
| 5. | కృష్ణదేవమహారాయలు (తల్లిదండ్రుల పేరున) | తై బ్రహ్మోత్సవం |
| 6. | హరిహర రాయ మహారాయలు | మాసి బ్రహ్మోత్సవం |
| 7. | వీరనరసింగయాదవరాయలు | పంగుణి బ్రహ్మోత్సవం |
| 8. | మేలుడయారు (ఆలయాధికారి) | చిత్తిరి బ్రహ్మోత్సవం |
| 9. | తాళ్ళపాక తిరుమలాచార్యులు | ఆణిబ్రహ్మోత్సవం |
| 10. | రామరాజుచిన తిమ్మరాజు | ఆణిబ్రహ్మోత్సవం |

ఈవిధంగా క్రీ.శ.16 శతాబ్దంలో శ్రీ వేంకటేశ్వర స్వామికి తొమ్మిది నెలల్లో పది బ్రహ్మోత్సవాలు 9,11,13 రోజుల పాటు జరుగుతుండేవి. ఈ బ్రహ్మోత్సవాలన్నీ కూడ సర్వమాన్యగ్రామాల, దేవమాన్య గ్రామాల భూముల సంవత్సర ఆదాయంపై ఆధారపడి జరుపబడుతుండేవి. ఒక్క తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు మాత్రం శ్రీభండారానికి రెండువేల వరహాలు



సమర్పించి ఆణి బ్రహ్మోత్సవాన్ని తనపేర ఏర్పాటు చేసినాడు. దాతలందరు తమ అనంతరం దానం రక్షింపబడాలని, తమ ఉభయం కొనసాగాలని కోరుకొంటూ శాసనం చివర్న

**“దానపాలనయోర్మధ్యే దానాత్ శ్రేయోనుపాలనమ్**
**దానాత్ స్వర్గమవాప్నోతి పాలనాదచ్యుతం పదమ్ ॥**
**స్వదత్తాత్ ద్విగుణం పుణ్యం పరదత్తానుపాలనమ్**
**పరదత్తాపహారేణ స్వదత్తం నిష్ఫలం భవేత్ ॥**

“దాన, పాలనముల మధ్య తమతమ భేదం వుంది. దానం కంటె ఇతరులు చేసిన దానాన్ని కాపాడుట శ్రేయస్కరమైన కార్యం. తను దానం చేయడంవలన స్వర్గం లభిస్తుంది. ఇతరుల దానాన్ని రక్షించడంవలన మోక్షం (జన్మరాహిత్యం) లభిస్తుంది. తను దానం చేసిన దానికంటె రెండింతలపుణ్యం ఇతరుల దానాన్ని కాపాడుట వలన లభిస్తుంది. ఇతరులు చేసిన దానద్రవ్యాన్ని అపహరించుటవలన తను చేసిన దానం నిష్ఫలం అవుతుంది” అని వ్రాయించేవారు.

క్రీ.శ.18వ శతాబ్దం నాటికి ఈ దాన గ్రామాలు, భూములు విదేశీయుల, పరమతస్థుల పరిపాలనకులోనై అన్యాక్రాంతం అయినాయి. స్థిరాస్తుల ఆదాయం పోవడంచేత వారు ఏర్పాటుచేసిన ధర్మాలు, ఉభయాలు నిలిచిపోయాయి. వారు ఏర్పాటుచేసిన బ్రహ్మోత్సవాలు నిలిచిపోయినాయి. అంతేగాక దాతలందరు వారిపేర, వారి జన్మనక్షత్రంనాడు చక్రస్నానం నిర్ణయించి ముందు ఎనిమిది, తొమ్మిది రోజుల నుండి జరిగే బ్రహ్మోత్సవాలను ఏర్పాటు చేశారు. (చూడు. దానశాసనాలు, 1-192 తేది 5-12-1429, తాళ్ళపాక పెదతిరుమలాచార్యుల దానశాసనం 4-129 తేది 7-3-1539) వారి తదనంతరం వారు ఏర్పాటుచేసిన ధర్మకార్యాలు సహజంగా నిలిచిపోయినాయి. అయితే సృష్టికర్త అయిన

బ్రహ్మదేవుడు లోకకల్యాణం కొరకు వేంకటేశ్వరస్వామి అవతార నక్షత్రం కన్యాశ్రవణంనాడు చక్రస్నానం నిర్ణయించి ముందు తొమ్మిది రోజుల నుండి నిర్వహించిన బ్రహ్మోత్సవాలు (బ్రహ్మదేవుని పేర పల్లవరాణి సామవై పెరుందేవి క్రీ.శ. 966లో ఏర్పాటుచేసినవి) మాత్రం అఖండవైభవంతో ఆనాటి నుండి నేటివరకూ కొనసాగుతూ శ్రీవేంకటేశ్వర వైభవాన్ని దశదిశలా చాటుతున్నాయి. ఇవి అంకురార్పణ, ధ్వజారోహణంతో మొదలై చక్రస్నానం, ధ్వజావరోహణంతో ముగియుచున్న పదిరోజుల తిరునాళ్ళు. వీటిని తమిళ భాషలో తిరుక్కోడి తిరునాళ్ అని పిలిచేవారు. ఈ పేరే శాసనాలలో వుంది.

ప్రస్తుతం తిరుమలలో కన్యామాసంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు తొమ్మిదిరోజులపాటు జరుగుతున్నాయి. అయితే చాంద్రమానరీత్యా సంవత్సరంలో అధికమాసం వచ్చినప్పుడు రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి.

## అధికమాసం

సౌరమానరీత్యా కన్యామాసంలో శ్రవణానక్షత్రంనాడు (వేంకటేశ్వరుడు తిరుమలపై అవతరించిననాటి నక్షత్రం అవభృధాన్ని (చక్రస్నానం) నిర్ణయించి ముందు తొమ్మిదిరోజులనుండి ఉత్సవం జరపడం సంప్రదాయం. సౌరమానరీత్యా వచ్చే కన్యాశ్రవణం సాధారణంగా చాంద్రమాన ఆశ్వయుజమాసంలో వస్తుంది. సౌరమాన రీత్యా సంవత్సరానికి 365 దినాలు. ఇందులో అధికమాసాలు లేవు. చాంద్రమానం ప్రకారం సవంత్సరానికి 354 దినాలు. కనుక చాంద్రమానంలో అధికమాసాలు వస్తుంటాయి. చాంద్రమాన సంవత్సరం సౌరమాన సంవత్సరం కంటే 11 దినాలు తక్కువ గలది యగుటచే ఒకప్పుడు చాంద్రమాన మాసాలలో సూర్యసంక్రాంతి లేని మాసం వస్తుంది. అదియు అధికమాసం. (సూర్య సంక్రమణం లేని చాంద్రమాసం) ఇది చాంద్రమానాన్ని సౌరమానంతో సరిపుచ్చడం కోసం ఏర్పడింది. అధికమాసం ప్రతి మూడవసంవత్సరంలో వస్తుంటుంది. అధికమాసం లేని సంవత్సరంలో కన్యాశ్రవణం ఆశ్వీయుజమాసంలోనే వస్తుంది. అప్పుడు ఆశ్వయుజ విదియ మొదలు (చిత్తానక్షత్రం మొదలు) విజయదశమి (శ్రవణానక్షత్రం) వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. అధికమాసం ఉన్న సంవత్సరంలో కన్యాశ్రవణం చాంద్రమాన భాద్రపద మాసంలో వస్తుంది. కనుక భాద్రపదమాసంలో జరిగే బ్రహ్మోత్సవాలు ప్రధానమైన వార్షిక బ్రహ్మోత్సవాలు. ఆ సవంత్సరంలో యథాపూర్వం ఆశ్వయుజ మాసంలో కూడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ రెండవ బ్రహ్మోత్సవాలను నవరాత్రి బ్రహ్మోత్సవాలు అని వ్యవహరిస్తారు. వీటిలో కన్యాభాద్ర పదమాసంలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రధానమైనవి. ఈ బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, ధ్వజారోహణంతో ప్రారంభమై ధ్వజావరోహణంతో ముగుస్తాయి. వాహనసేవలు యథావిధిగా వుంటాయి. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో అంకురార్పణ, ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. ఈ ఉత్సవాలకు అష్టదిక్పాలకులు, దేవతలు ఆహ్వానింపబడరు. వాహనఉత్సవాలు మొదటివార్షికబ్రహ్మోత్సవాలలో కొయ్యతేరును రథోత్సవంలో ఉపయోగిస్తారు. రెండవ నవరాత్రిబ్రహ్మోత్సవాలలో కొయ్యతేరుకు బదులు వెండిరథాన్ని ఉపయోగించేవారు. ఇప్పుడు వెండి రథానికి బదులుగా బంగారు రథాన్ని ఉపయోగిస్తున్నారు. మొదటి వార్షిక బ్రహ్మోత్సవాలలో రాత్రి వాహన ఊరేగింపుతర్వాత ఉత్సవ మూర్తులను తిరుమలరాయ మండపంలో ప్రతినిత్యం బంగారు తిరుచ్చిలో ఆస్థానం జరుగుతుంది. రెండవ నవరాత్రి బ్రహ్మోత్సవాలలో రాత్రి వాహనోత్సవం తర్వాత ప్రతినిత్యం రంగనాయకుల మండపంలో బంగారు శేషవాహనంపై ఉత్సవమూర్తులకు (మలయప్పస్వామి, శ్రీదేవి భూదేవులకు) ఆస్థానం జరుగుతుంది.

ఈ నందననామ సంవత్సరం (2012–2013)లో అధిక భాద్రపద మాసం వచ్చింది. కనుక ఈ నందన సంవత్సరంలో కన్యా నిజభాద్రపద మాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, ఆశ్వయుజ మాసంలో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. దేశంలో ఇతర వైష్ణవ దేవాలయాలలో అధిక మాసం వచ్చిన సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు జరిగే సంప్రదాయం లేదు. తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామికి మాత్రమే రెండు బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇవి సౌరమానం పాటించే వైష్ణవమత సంప్రదాయానికి తెలుగు ప్రజలు పాటించే చాంద్రమాన సంప్రదాయానికి సమన్వయం చేకూర్చుటకు తిరుమలలోనే జరుపబడుతున్నాయి. గత మూడు సంవత్సరాలలో బ్రహ్మోత్సవాలలో చక్రస్నానం జరిగిన తేదీలు ఇట్లున్నాయి.

| | | |
|---|---|---|
| 1. విరోధి (2009–10) | అధికమాసం లేదు. | 29–9–2009 |
| 2. వికృతి (2010–11) | అధికమాసం ఉంది. | 19–09–2010 |
| | రెండవ బ్రహ్మోత్సవం | 16–10–2010 |
| 3. ఖర (2011–12) | అధిక మాసం లేదు | 07–10–2011 |
| 4. నందన (2012–13) | అధికమాసం వుంది | 26–09–2012 |
| | నవరాత్రి బ్రహ్మోత్సవం | 23–10–2012 |

పై చక్రస్నానం తేదీలు పరిశీలించి నట్లయితే అధికమాసం వచ్చిన సంవత్సరాలలో రెండవ బ్రహ్మోత్సవం నిర్వహించకపోతే వార్షిక బ్రహ్మోత్సవాల మధ్యవ్యవధి సంవత్సరం దాటిపోతుంది. కనుక ప్రతి సంవత్సరంలోగా బ్రహ్మోత్సవాలు నిర్వహించవలసియుండుటచే అధిక మాసం వచ్చిన సంవత్సరం రెండు బ్రహ్మోత్సవాలు జరుపబడుతున్నాయి అని స్పష్టమగుచున్నది.



## కోయిల్ ఆళ్వారు తిరుమంజనం

బ్రహ్మోత్సవ పండుగ వేడుకలు ప్రారంభించడానికి ముందు శ్రీ వేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని శుద్ధి చేస్తారు. ఈ శుద్ధి కార్యక్రమం 'కోయిల్ ఆళ్వారు తిరుమంజనం' అనే పేరుతో వైభవంగా జరుపబడుతుంది. కోయిల్ అనగా దేవాలయం. ఆళ్వారు అనగా భక్తుడు. భక్తుని హృదయంలో భగవంతుడు వున్నట్లుగా దేవాలయంలోని గర్భగృహంలో దేవుడు వుంటాడు. కనుక దేవాలయంకూడ ఒక భక్తునిగా గౌరవింపబడుచున్నది. ఇట్లు కోవెలకు భక్తునకు అభేదం చెప్పబడింది. కోయిల్ అను భక్తునికి జరిపే తిరుమంజనం (మంగళస్నానం) శుద్ధికార్యక్రమంగా జరుపబడుచున్నది. తిరుమలలో వార్షిక బ్రహ్మోత్సవాల ప్రారంభానికి ముందు వచ్చే మంగళవారం నాడు కోయిల్ ఆళ్వారు తిరుమంజనం – శుద్ధి కార్యక్రమం – జరుగుతుంది. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలకు ముందేగాక ఉగాది, ఆణివారి ఆస్థానం, వైకుంఠఏకాదశి పండుగ దినాలకు ముందు కూడ సంవత్సరానికి నాలుగు సార్లు జరుపబడుచున్నది.

గర్భగృహం లోపల నాలుగు గోడలకు పైకప్పును అంటుకొనియున్న దుమ్ము, ధూళి, బూజు, కర్పూరపు మసిని, దీపాల మసిని గోకి, రుద్ధి శీకాయ నీళ్ళతో శుభ్రం చేస్తారు. తర్వాత సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన లేహ్యాన్ని గోడలకు, పైకప్పుకు పలుచగా పూస్తారు. ఇదీ శుద్ధి కార్యక్రమం. ఈ కార్యక్రమం దేవాలయంలోని అన్ని భాగాలలో జరుగుతుంది. కోయిల్ఆళ్వారుతిరుమంజనంనాడు ప్రతిరోజువలె సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన మొదటి గంట నైవేద్యం, శాత్తుమొర కార్యక్రమాలు యథావిధిగా జరుపబడుతాయి. పిమ్మట ఆనందనిలయంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ధ్రువమూర్తిపై దుమ్ము, మసి, నీళ్ళు పడకుండా శిరసాది పాదాంతం ఒక వస్త్రాన్ని తొడుగుతారు. ఈ

వస్త్రాన్ని 'మలైగుడారం' అని పిలుస్తారు. మూలమూర్తితో పాటు భోగ శ్రీనివాసమూర్తి వెండివిగ్రహం కూడ మలైగుడారంలో వుంటుంది. ఇక మిగిలిన ఉత్సవ విగ్రహాలు, సాలగ్రామాలు బంగారువాకిలి ముందు గల ఘంటామండపంలోకి తరలించి, అక్కడ ఏకాంతంగా వాటికి తిరుమంజనం నిర్వహిస్తారు. పంచపాత్రలు, దీపపు సెమ్మెలు, తీర్థం చెంబులు మొదలగు పాత్రలను బంగారుబావివద్దకు తీసుకొనిపోయి, అక్కడ వాటిని తోమి, కడిగి, శుభ్రం చేస్తారు. అంతేగాక దేవాలయంలో గల వాకిళ్ళను, వాహనాలను శుభ్రం చేస్తారు. ఇట్లు ఆనందనిలయం, దేవాలయంతోపాటు విమాన ప్రదక్షిణంలో వున్న పరివారదేవతల ఆలయాలలో కూడ శుద్ధి కార్యక్రమం జరుగుతుంది. ఆలయంలోని గోడలు, పైకప్పులు శుభ్రం చేసిన తర్వాత సుగంధద్రవ్యాలతో తయారుచేయబడిన 'పరిమళం' అనే లేహ్యాన్ని గోడలకు, పైకప్పులకు పలుచగా పూస్తారు. గర్భగృహంలో పై కప్పుకు 'కురాళం' అనే పట్టు వస్త్రాన్ని కడతారు, పిమ్మట నేలంతా నీళ్ళతో కడిగి శుభ్రం చేస్తారు. తర్వాత ఉత్సవ విగ్రహాలను, పంచపాత్రలు మొదలగు వాటిని యథాస్థానంలోకి తరలిస్తారు. వాకిళ్ళకు ఉన్న పాత తెరలను తీసివేసి కొత్తవి కడతారు. పిమ్మట గర్భగుడిలో మూలమూర్తికి తొడిగిన మలైగుడారం తీసివేస్తారు. దీపారాధనలుచేసి, అన్ని విగ్రహాలను లఘువుగా ఉపచారాలుచేసి, కర్పూర హారతి యిస్తుండగా ఆనంద నిలయం తెరతీస్తారు. అందరూ శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించి హారతి స్వీకరించి ధన్యులవుతారు. ఇట్లు కోయిల్ ఆళ్వారు తిరుమంజనం కార్యక్రమం పూర్తి అవుతుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు, వాహనాలు, అర్చకులు, ఉద్యోగులు, భక్తులు అందరూ బ్రహ్మోత్సవాలకు సంసిద్ధులుగా వుంటారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో రంగురంగుల పూలతోరణాలతో, అరటి స్తంభాలతో, మామిడాకుల తోరణాలతో కన్నుల పండువుగా, రమణీయంగా అలంకరిస్తారు. ఆ తర్వాత కార్యక్రమం అంకురార్పణ.



ధ్వజారోహణానికి ముందురోజు సాయంకాలంలో భగవన్నారాయణుని సేనాధిపతియగు విష్వక్సేనుడు దేవాలయానికి నైరుతి మూలలో నున్న వసంతమండపానికి శ్వేతచ్ఛత్రచామర మంగళ వాద్యాలతో ఊరేగింపుగా వెళ్ళి, వేదపండితులు, అర్చకులు మంత్రా చదువుచుండగా భూమి పూజ, మృత్సంగ్రహణం (పుట్టమట్టి సేకరించుట) చేసి ప్రదక్షిణంగా వచ్చి ఆలయంలో ప్రవేశిస్తాడు. విష్వక్సేనుడు నాలుగు మాడవీధులలో ఊరేగుతూ ఉత్సవం యొక్క ఏర్పాట్లను కూడ పరిశీలిస్తాడు. ఈ సన్నివేశాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు

**అది వచ్చె నిది వచ్చె నచ్యుత సేనాపతి**
**పది దిక్కులకు నిట్టె పారరో యసురులు॥** –2–79

అని విష్ణుదేవుని సేనాధిపతి రాక రాక్షసులకు భయం గలిగించిందని వర్ణించాడు. ఆ రాత్రి యాగశాలయందు కొత్తపాలికలలో నవధాన్యాలను పోసి, మంత్ర పురస్సరంగా హస్తా నక్షత్రమున అంకురార్పణ కార్యక్రమం జరుగుతుంది.

మరునాడు ఉదయం కన్యామాసంలో చిత్తానక్షత్రం నాడు వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం గరుడకేతన ప్రతిష్ఠ, కంకణధారణ ఆలయఆవరణలో జరుగుతుంది. దేవాలయం బయటచుట్టూ అష్టదిక్కులలోను బలిని వేస్తూ మలయప్పస్వామి దేవేరీ సహితుడై పరివార దేవతలతో ఊరేగుతుండగా అష్టదిక్పాలకులు ఆహ్వానింపబడుతారు. ఇట్లు దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన తర్వాత మలయప్పస్వామి ఆలయంలోకి వస్తారు. అనంతరం శ్రీవారు ధ్వజస్తంభమండపంలో వుండగా స్వామివారి అనుమతితో అర్చకులు గరుత్మంతునిరూపం చిత్రించబడిన నూతనకేతనాన్ని వేదపండితులు వేదమంత్రాలను స్వరయుక్తంగా చదువుచుండగా, మంగళవాద్యాలు

మ్రోగుచుండగా "ఓం తత్పురుషాయ విద్మహే, స్వర్ణపక్షాయ ధీమహి, తన్నో గరుడః ప్రచోదయాత్" అను గరుడ గాయత్రీమంత్రాన్ని పఠించి బంగారు ధ్వజస్తంభంపై ఎగురవేస్తారు. ఈ ధ్వజారోహణం ఉత్సవం కనుల పండువుగా, కడువైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా ముద్గలాన్నం (పెసరపులగం) నివేదింపబడుతుంది. ఈ ప్రసాదాన్ని స్వీకరిస్తే సంతానం లేని స్త్రీలు సంతానవతులవుతారని ప్రజల విశ్వాసం. ఆ తర్వాత ధ్వజస్తంభానికి దక్షిణంగా వున్న తిరుమలరాయని మండపంలో సర్వాభరణ భూషితుడయిన మలయప్పస్వామి దేవేరులతో బంగారు తిరుచ్చిలో వేంచేసి యుండగా ఆస్థానం జరుగుతుంది.

మింటికెగసిన గరుత్మంతుడు–

**"శ్రీ వేంకటేశ్వర దేవాదిదేవుని**
**బ్రహ్మోత్సవంబు రారండు ప్రజలు**
**భక్తిప్రపత్తులు బత్తెముల్ కాగను**
**దర్శనోత్సాహంచె దక్షిణ గను**
**బ్రహ్మయాధ్వర్యంబు పరమోత్సవం బిది**
**శ్రీనివాసుని శోభ జెప్పదరమె**
**బాలురు వృద్ధులు పత్నులు యువకులు**
**యువతులు నెల్లవారుత్సవమున**

**"కరుగుదేరగవచ్చు నందరకుగూడ**
**నన్నివిధముల నేర్పాటు లలరులోటు**
**కలుగ దెవ్వరికిని జీమకాలియంత**
**రండు రండు ప్రయాణంబు కండు వేగ"**



అని ఎలుగెత్తి చాటినాడు. దేశమంతటా నివసించిన ప్రజను ఆబాలగోపాలం శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రండు అని గరుడుడు ఆహ్వానించాడు.

ప్రస్తుతం తిరుమలలో ధ్వజారోహణఉత్సవం సాయంకాలం జరుగుతున్నది. కాని పూర్వం ధ్వజారోహణ ఉత్సవం ఉదయాన్నే సుముహూర్తంలో జరుగుతుండేది. సామాన్యంగా జెండా ఉదయాన్నే ఎగురవేయడం, సాయంకాలం పతాకాన్ని దింపివేయడం జరుగుతుంది. ఇదీ సంప్రదాయం. తిరుమలలో సాయంకాలం ధ్వజారోహణఉత్సవం జరగడం అనేమార్పు ఎవరి సౌకర్యం కోసం, ఎప్పుడు, ఎందుకు జరిగిందో వెంకన్నకే ఎరుక! వైఖానస ఆగమాన్ని పాటిస్తున్న ఇతర దేవాలయాలలో ధ్వజారోహణ ఉత్సవం ఉదయాన్నే జరుగుచున్నది. భవిష్యోత్తర పురాణం బ్రహ్మ జరిపిన బ్రహ్మోత్సవాలను ఇట్లు వర్ణించింది.

**అంకురార్పణమాతేనుః సహర్షపులకాంకురాః**
**తతోఽపరేద్యు రుషసి ధ్వజారోహమహోత్సవమ్॥**
**ఆరభ్యావభృథాంతం చ పుష్పయాగాంతమేవ చ**
**ఉత్సవం శ్రీనివాసస్య చకార విధివద్విధిః॥**

అధ్యా 14–43, 44 శ్లో॥

–బ్రహ్మాది దేవతలు, మహర్షులు, విష్వక్సేనాదులు సంతోషాతిశయమున శరీరం పులకరించుచుండగా అంకురార్పణం చేసిరి. ఆ మరుసటిదినం ప్రాతఃకాలంలో ధ్వజారోహణమహోత్సవం మొదలుకొని అవభృథస్నానంవరకు పుష్పయాగాంతం వరకు యథావిధిగా శ్రీనివాసునకు మహోత్సవాన్ని బ్రహ్మ నిర్వహించెను.

తిరుమల నివాసి తరిగొండ వెంగమాంబ (1730–1817) గారి వేంకటాచలమాహాత్మ్యమనే పద్యకావ్యంలో బ్రహ్మోత్సవ ప్రారంభం ఇలా వర్ణింపబడింది.

"హస్తయందంకురార్పణంబును నైవేద్యాది కృత్యంబులు నెరవేర్చి యమ్మరునాడుదయంబున బుణ్యాహవచన వాస్తుహోమ, గరుడప్రతిష్ఠా, గరుడహోమ, భేరీ తాళతాడన కంకణధారణార్చకబహుమానాది కృత్యంబులొనరించి" –అశ్వా 2–124

క్రీ.శ. 18వ శతాబ్దంలో, 19వ శతాబ్దారంభంలో హస్తా నక్షత్రంలో అంకురార్పణం, మరునాడు ఉదయాన చిత్తానక్షత్రమందు ధ్వజారోహణం, జరుగుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యేవని స్పష్టమగుచున్నది. "చిత్తను ధ్వజారోహణ మొనరించి" (2–126) అని వెంగమాంబ మరొకచోట వర్ణించింది.

బ్రహ్మ జరిపిన ఉత్సవాలలో ఆరవదినం సాయంకాలాన ఉద్యానవనవిహారోత్సవం, చక్రస్నానం తర్వాత మరునాడు పుష్పయాగ మహోత్సవం జరిగేవి. ఇప్పుడు జరుగుటలేదు. కారణం తెలియదు.

ధ్వజారోహణం జరిగిన రాత్రి నుండి శ్రీ వేంకటేశ్వరస్వామికి ఉత్సవమూర్తి అయిన మలయప్పస్వామి శ్రీదేవి భూదేవీ సమేతుడైయుండగా వివిధవాహనాలపై ప్రతిరోజు పగలు, రాత్రి ఉత్సవాలు, ఊరేగింపులు అంగరంగవైభవంగా తొమ్మిదిరోజులపాటు జరుగుతాయి. అశౌచం మొదలగు కారణాల చేత గుడిలోని దేవుని దర్శింపలేని వారికి దైవప్రతినిధి (ఉత్సవమూర్తి) దర్శన భాగ్యం అనుగ్రహిస్తూ ఆగమశాస్త్రాలు వాహనసేవలను, ఊరేగింపులను విధించాయి. భక్తులకు శ్రీవారి వాహనసేనలలో ఆధ్యాత్మిక సందేశం లభిస్తుంది. వాహనానికి సంబంధించిన ఇతిహాసంతోపాటు భక్తులకు ఆనందం, తత్త్వోపదేశం లభిస్తుంది.



## వాహనోత్సవక్రమము

| క్రమసంఖ్య | పగలు ఉత్సవం | రాత్రిఉత్సవం |
|---|---|---|
| 0 | సాయంకాలం బంగారుతిరుచ్చి | సేనాధిపతిఉత్సవం అంకురార్పణ |
| 1 రోజు | ధ్వజారోహణం (సాయంకాలం) | పెద్దశేషవాహనం |
| 2 రోజు | చిన్న శేషవాహనం | హంసవాహనం |
| 3 రోజు | సింహవాహనం | ముత్యపుపందిరివాహనం |
| 4 రోజు | కల్పవృక్షవాహనం | సర్వభూపాలవాహనం |
| 5 రోజు | పల్లకి, మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 6 రోజు | హనుమంతుని వాహనం సాయంకాలం వసంతోత్సవం (సువర్ణరథరంగడోలోత్సవం) | |
| 7 రోజు | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 8 రోజు | రథోత్సవం | అశ్వవాహనం |
| 9 రోజు | పల్లకి ఉత్సవం, చక్రస్నానం | బంగారుతిరుచ్చి ధ్వజావరోహణం |

మలయప్పస్వామి బ్రహ్మోత్సవాలలో జరిగే వాహన సేవలలో (1) పెద్దశేషవాహనం (2) ముత్యాలపందిరి (3) కల్పవృక్షవాహనం (4) సర్వభూపాలవాహనం (5) సువర్ణరథం (6) రథోత్సవం (7) బంగారుతిరుచ్చి (పల్లకి) వాహనంలలో శ్రీదేవీ భూదేవీ సహితుడై తిరుమల నాలుగు మాడవీథులలో వేడుకగా ఊరేగుతారు.

మలయప్పస్వామి ఒక్కరే (1) చిన్నశేష వాహనం (2) హంసవాహనం (3) సింహవాహనం (4) మోహినీ అవతారం (పల్లకివాహనం) (5) గరుడవాహనం (6) హనుమంతుని వాహనం (7) గజవాహనం (8) సూర్యప్రభ (9) చంద్రప్రభ (102) అశ్వవాహనంపై తిరుమల మాడవీథులలో విహరిస్తాడు.

శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవవైభవాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు

**తిరువీథుల మెరసీ దేవదేవుడు**
**గరిమల మించిన సింగారములతోడను** ॥పల్లవి॥

**తిరుదండెలపై నేగీ దేవుడిదె తొలునాడు**
**సిరులు రెండవనాడు శేషునిమీద**
**మురిపేన మూడోనాడు ముత్యాలపందిరిక్రింద**
**పొరి నాలుగోనాడు పువ్వుగోవిలలోను** ॥ తిరు ॥

**గక్కున నయిదవనాడు గరుడునిమీదను**
**యెక్కెను ఆరవనాడు యేనుగుమీద**
**చొక్కమై యేడవనాడు సూర్యప్రభలోను**
**యిక్కువ దేరును గుర్ర మెనిమిదోనాడు** ॥ తిరు ॥

**కనకపుటందలము కదిసి తొమ్మిదోనాడు**
**పెనచి పదోనాడు పెండ్లిపీట**
**యెనసి శ్రీవేంకటేశు డింతి యలమేల్మంగతో**
**వనితల నడుమను వాహనాలమీదను** ॥ తిరు ॥

–అన్నమయ్య సంకీర్తనలు, సం॥ 13–192



అని కన్నులకు కట్టినట్లు రమణీయంగా వర్ణించాడు. ప్రస్తుతం అన్నమయ్య వర్ణించిన బ్రహ్మోత్సవాలలో పదవరోజు కల్యాణోత్సవం నేడు ప్రతిరోజు నిత్యకల్యాణోత్సవంగా నిర్వహింపబడుతున్నది.

వేంకటేశ్వరుడు ఇన్ని (17) వాహనా లెక్కి ఊరేగుతుండడం వల్లనే భక్తజనులకు ప్రీతిపాత్రుడయినాడట! అన్నమాచార్యులు వేంకటేశ్వరుని శక్తిసామర్థ్యాలకు ఆశ్చర్యపోతూ

**ఎట్టు నేరిచితివయ్య యిన్ని వాహనము లెక్క**
**గట్టిగా నిందుకే హరి కడు మెచ్చేమయ్యా !**

అని స్తుతించాడు. బ్రహ్మోత్సవాలకు తిరుమల చేరుకొనే భక్తజనులను గూర్చి అన్నమయ్య ఇట్లు వర్ణించాడు.

**నానా దిక్కుల నరులెల్లా**
**వానలలోనే వత్తురు గదలి** ॥ పల్లవి ॥

**సతులు సుతులు బరిసరులు బాంధవులు**
**హితులు గొలువగా నిందరును**
**శతసహస్రయోజనవాసులును**
**వ్రతములతోడనె వత్తురు గదలి** ॥ నానా ॥

**ముడుపులు జాళెలు మొగి దలమూటలు**
**కడలేని ధనము గాంతలును**
**కడుమంచి మణులు కరులు తురగములు**
**వడిగొని చెలగుచు వత్తురు గదిలి** ॥ నానా ॥

**మగుటవర్ధనులు మండలేశ్వరులు**
**జగదేకపతులు జతురులును**

**తగు వేంకటపతి దరుశింపగ బహు**
**వగల సంపదల వత్తురు గదలి** ॥ నానా ॥

–అన్నమాచార్య సంకీర్తనలు, సం॥ 11-134

## 1. పెద్ద శేషవాహనం

బ్రహ్మోత్సవాలలో శ్రీ వేంకటేశ్వరస్వామి అధిరోహించే ఒక్కొక్కవాహనానికి ఒక్కో చరిత్ర ఉంది. ఐతిహ్యం వుంది. అంతేగాక శ్రీవారు ఒక్కో వాహనం ఎక్కి ఊరేగుతూ భక్తజనులకు ఒక్కో సందేశం ఇస్తుంటారు. ధ్వజారోహణం జరిగిన రాత్రి శ్రీదేవీ, భూదేవీ సమేత మలయప్పస్వామికి ఏడుపడగల బంగారు పెద్దశేషవాహనంపై ఉత్సవం జరుగుతుంది. "బహువనపాదపాబ్ధి కులపర్వత పూర్ణసరస్సరస్వతీ సహిత మహా మహీభర మజస్ర సహస్రఫణాళి దాల్చి దుస్సహతరమూర్తికిన్ జలధిశాయికి" శ్రీమన్నారాయణభగవానునికి పాయక శయ్యయైన యయ్యహిపతి దుష్కృతాంతకుడు అనంతుడు (అనేకములైన అడవులతో, చెట్లతో సముద్రాలతో, కులపర్వతాలతో, నీటితో నిండిన సరస్సులతో, నదులతో కూడిన భూమియొక్క బరువును నిరంతరం తన వేయి పడగలతో మోయుచున్న తేరిచూడరాని రూపము గలిగి పాల సముద్రంలో శయనించియున్న శ్రీమన్నారాయణునికి నిరంతరం శయ్యగావున్న సర్పజాతికి అధిపతి, పాపాలను నిర్మూలించువాడైన ఆదిశేషుడు) శ్రీ మన్నారాయణుని అర్చామూర్తియైన వేంకటేశ్వరస్వామికి (శ్రీనివాసునకు) బ్రహ్మోత్సవ ప్రారంభంలో మొదటిరోజు రాత్రి వాహనమైనవాడు. విశిష్టాద్వైత సిద్ధాంతం ప్రకారం భగవంతుడు శేషి, ఇతరమైనవి శేషభూతాలు. స్వామి శేషవాహనంపై ఊరేగడంద్వారా భక్తులకు ఈ శేషశేషి సంబంధాన్ని బోధిస్తున్నాడు.



## 2. చిన్నశేషవాహనం

శేషాచలవాసియైన వేంకటేశ్వరస్వామి ఒక్కరే రెండవరోజు పగలు ఉత్సవంలో అయిదు పడగల చిన్న శేషవాహనంపై ఊరేగుతాడు. శేషుడు నారాయణాంశసంభూతుడు. విష్ణుదేవుని అపరదేహం

**నివాసన శయ్యాసన పాదకాంశుకో**
**పధాన వర్షాతప వారణాదిభిః**
**శరీర భేదైస్తవ శేషతాం గతైః**
**యథోచితం శేష ఇతీర్యతే జనైః॥**

–ఆదిశేషుడు శ్రీనివాసునకు వాసం, శయ్య, ఆసనం, పాదుక, ఉత్తరీయం, తలగడ, ఎండవానల నుండి రక్షించే ఛత్రం, పదపీఠం, సేవకుడు శరీరభేదం గలిగి విష్ణుదేవునికి శేషతల్పపాత్రుడయినాడు. శేషుడని జనులచే కీర్తింపబడుతున్నాడు. భూలోకంలో అవతరించదలంచిన విష్ణుదేవునికి అనువైన ప్రదేశంగ ఆదిశేషుడు పర్వతరూపం ధరించాడు. నారాయణుడు శేషాద్రిపై అవతరించాడు. స్వామికి శేషునికి గల సంబంధం అటువంటిది. అందువల్లనే బ్రహ్మోత్సవాలలో రెండవసారి శేషుడు వాహనమైనాడు. ఈ వాహనంపై స్వామి మురళీమనోహరుడుగా భక్తులకు కనువిందు చేస్తాడు. (ఈ అలంకారం మారుతుంటుంది). తరిగొండ వెంగమాంబ బ్రహ్మోత్సవాలను వర్ణిస్తూ ధ్వజారోహణం నాటిరాత్రి "అలఘు శేషవాహనోత్సవంబును, మరునాడుదయంబునందు లఘుశేష వాహనోత్సవంబును" (2-128) అని శేషవాహనవైవిధ్యాన్ని వర్ణించింది. ఈస్టిండియా కంపెనీ ఆంగ్లేయాధికారి ఒకడు క్రీ.శ.1830 సంవత్సరంలో తిరుమల బ్రహ్మోత్సవాలను దర్శించి చిన్నశేషవాహనాన్ని బాలశేష వాహనమని పేర్కొన్నాడు. అంతేగాక బ్రహ్మోత్సవాలలో చివరిరోజు వాహనం

బాలశేషవాహనం అని చెప్పినాడు. ఈ బ్రహ్మోత్సవాలను గురించి, తిరుమల దేవాలయం గురించి వేంకటేశ్వరుని గురించి అతడు ఒక వ్యాసం వ్రాసినాడు. (పేరు చెప్పుకొనలేదు) ఈ ఆంగ్లవ్యాసం ఏషియాటిక్ జర్నల్, మే-ఆగష్టు సంచిక, 1831లో ప్రచురించబడింది. ఈ పత్రిక కలకత్తా నుండి వెలువడేది.

తాళ్ళపాక అన్నమాచార్యులు బ్రహ్మోత్సవాలలో శేషవాహన వైభవాన్ని ఇట్లు కీర్తించాడు.

**వీడుగదే శేషుడు శ్రీ వేంకటాద్రిశేషుడు**
**వేడుక గరుడునితో బెన్నుద్దైన శేషుడు** ॥ పల్లవి ॥

**వేయి పడగలతోడ వెలసిన శేషుడు**
**చాయ మేని తళుకువజ్రాలశేషుడు**
**మాయని శిరసులపై మాణిక్యాలశేషుడు**
**యేయెడ హరికి నీడై యేగేటి శేషుడు** ॥ వీడు ॥

**పట్టపువాహనమైన బంగారుశేషుడు**
**చుట్టుచుట్టుకొనిన మించుల శేషుడు**
**నట్టుకొన్న రెండువేలునాలుకలశేషుడు**
**నెట్టిన వారి బొగడ నేరుపరి శేషుడు** ॥ వీడు ॥

**కదిసి పనులకెల్ల గాచుకున్న శేషుడు**
**మొదల దేవతలెల్లా మొక్కే శేషుడు**
**అదె శ్రీవేంకటపతి కలుమేలుమంగకును**
**వదరకయ పొద్దు పానుపైన శేషుడు** ॥ వీడు ॥

-అన్నమయ్యసంకీర్తనలు, సం॥9-76



## 3. హంసవాహనం

రెండవరోజు రాత్రి బంగారు హంసవాహనంపై శ్రీ వేంకటేశ్వరస్వామి ఒక్కడే వీణాపాణియై చదువుల తల్లి సరస్వతి రూపంలో కనిపిస్తూ భక్త జనులకు కనువిందుచేస్తూ తిరుమల మాడవీథులలో ఊరేగుతాడు. "గుంభనమున దుగ్ధజీవన విభాగ విధాన నిరూఢ నైపుణీ జనిత మహాయశో విభవసారము" గలది హంస. (పాలునీరు వేరుచేయటయందలి నేర్పుచే గలిగిన కీర్తి సంపద గలది హంస) హంస పాలను నీళ్లను వేరుచేసినట్లే గుణావగుణ విచక్షణాజ్ఞానానికి సంకేతం. ఇహలోకబంధవిముక్తుడయిన జీవునిఆత్మ హంస. అటువంటి హంసవాహనంపై పరమహంస వేంకటేశ్వరస్వామి ఊరేగడం సముచితమైన వైభవం. భక్తజనావళికి ఆనందదాయకం. హంస మానససరోవరంలో విహరిస్తుంది. పరమాత్మ అనన్యభక్తుల మనస్సులనెడి సరస్సులలో విహరిస్తాడు. ఆత్మానాత్మ వివేకంగలవాడే ఆత్మ దర్శనం చేయగలడు. "హంస చేతి పాలునీరు నట్లాయె బ్రదుకు" అని అన్నమయ్య ఈ తత్వాన్ని కీర్తించాడు. హంస వాహనంలోని పరమార్థం ఇదే. భగవంతుడు హంసరూపంలోనే బ్రహ్మదేవునికి వేదాలను ఉపదేశించాడు. శ్రీ వేంకటేశ్వరస్వామి హంస వాహనారూఢుడై వాగ్దేవత సరస్వతీదేవి అలంకారంలో ఆత్మానాత్మ వివేకాన్ని భక్తులకు బోధిస్తున్నాడు. వేంకటేశ్వరస్వామి "తరుణాంగుళిచ్ఛాయ దంతపుర సరకట్టు లింగలీకపు వింతరంగులీన" తనమదికి ఉల్లాసము గలుగ వీణను వాయిస్తూ భక్తులకు వీనులవిందు చేస్తున్నాడు.

## 4. సింహవాహనం

బ్రహ్మోత్సవాలలో మూడవరోజు పగలు మలయప్పస్వామి ఒక్కడే సింహవాహనంపై ఊరేగుతాడు. సింహం మృగరాజు. " మృగాణాం చ మృగేంద్రోఽహం" అని శ్రీకృష్ణభగవానుడు సింహం యొక్క విశిష్టతను

“మృగాలలో సింహాన్ని నేనే” అని వివరించాడు. విష్ణు సహస్రనామా లలో సింహః నామం రెండుసార్లు (202,489) వస్తుంది. మృగరాజయిన సింహాన్ని చూచి ఇతర జంతువులు భయపడినట్లు భగవంతుని చూచి దేవతలు, మానవులు అందరూ మనం తప్పు చేసినచో స్వామి దండించునను భయం గలిగి ఉంటారు గనుక సింహపదం భగవంతునికి రూఢియగు చున్నది. సార్థకమగుచున్నది. విష్ణుదేవుడు సింహముఖుడై దుష్టుడైన హిరణ్యకశిపుని సంహరించి భక్తుడైన ప్రహ్లాదుని రక్షించినాడు. యోగశాస్త్రంలో సింహం వహనశక్తికి, గమనశక్తికి ప్రతీక. భీమాదులు సింహబలులు. వేంకటేశ్వరస్వామికి నిలయమైన ఆనందనిలయంపై నలువైపులా సింహప్రతిమలు గలవు. అవి స్వామి రక్షణశక్తికి సంకేతాలుగా వున్నవి. బ్రహ్మోత్సవాలలో వేంకటేశ్వరస్వామి సింహవాహనుడై ఊరేగడం దుష్టజనసంహారానికి, భక్తజన సంరక్షణకు సంకేతం. ఉన్నతమైన ఆసనానికి సింహాసనమను పేరు గలదు. నరోత్తముడు (రాజు) సింహాసనాన్ని అధిష్ఠించి ప్రజలను, రాజ్యాన్ని సంరక్షిస్తాడు. దుష్టులను శిక్షించేవాడు. ఈ విధంగా సింహం రక్షణశక్తికి సంకేతంగా మారింది.

## 5. ముత్యపుపందిరి వాహనం

మూడవరోజు రాత్రి ముత్యపుపందిరి వాహనంపై శ్రీదేవిభూదేవులతోకూడి మలయప్పస్వామి తిరుమాడవీధులలో విహరిస్తాడు. ముత్యాలు చల్లదనాన్ని కలిగిస్తాయి. స్వాతికార్తెలో వానచినుకు సముద్రంలోని ముత్యపుచిప్పలోపడి మంచిముత్యంగా మారుతుంది. శ్రీకృష్ణుడు “నాసాగ్రే నవమౌక్తికం” (ముక్కుకొనలో క్రొత్తముత్యాన్ని ధరించినవాడు) అని వర్ణన. వేంకటేశ్వరుడు “మౌక్తికస్రగ్వి” (ముత్యాలహారాన్ని ధరించినవాడు) అని ప్రస్తుతింపబడుచున్నాడు. శ్రీమన్నారాయణుడు “ముక్తాత పత్రితానంత



సహస్ర ఫణమండలుడు” (ముత్యాల గొడుగు వలె నున్న ఆదిశేషుని వేయిపడగల క్రిందనున్నవాడు) మంచిముత్యాలతో నిర్మించబడిన ముత్యపు పందిరిని వాహనంగా చేసుకొని మలయప్పస్వామి ఉభయదేవేరులతో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తాడు.

శరన్నవరాత్రులలో నిర్మలాకాశంలో మెరుస్తున్న నక్షత్రాలను మించి ప్రకాశిస్తున్న విద్యుద్దీపాల మధ్య ప్రకాశిస్తున్న ముత్యాల పందిరివాహనం భక్తులకు నయనానందకరంగా సాగిపోతుంటుంది. చల్లని ముత్యాల పందిరిలో శైత్యోపచారాన్ని సీకరిస్తున్నట్లున్న వేంకటేశ్వరస్వామిదర్శనం భక్తుల తాపత్రయాలను పోగొట్టుతుంది. వేంకటేశ్వరుడు

**“నీరము ముత్యమట్లు నళినీదళసంస్థితమై తనర్చు నా**
**నీరమె శుక్తిలోబడి మణిత్వము గాంచు సమంచితప్రభన్”**

(నీటిబొట్టు తామరాకును ఆశ్రయించి ముత్యంవలె కనిపిస్తుంది. ఆ నీటిబొట్టే ముత్యపుచిప్పను ఆశ్రయించి మంచిముత్యమయి ప్రకాశిస్తుంది.) కనుక ఓ భక్తజనులారా! మీరుకూడ నీటి బొట్టు తామరాకును ఆశ్రయించినట్లు ఇతరదేవతలను ఆశ్రయించి ఆభాససౌఖ్యమును పొందకుండ, నన్ను ఆశ్రయించి వాస్తవసౌఖ్యాన్ని నీటిబొట్టు ముత్యపు చిప్పను ఆశ్రయించి మంచిముత్యమయినట్లు పొందండి అని ఉపదేశిస్తున్నాడు.

వార్షికబ్రహ్మోత్సవాలలో వేంకటేశ్వరుడు ముత్యపుపందిరి వాహనంలో బకాసురుని చంచువులను పట్టుకొని గడ్డిపోచను చీల్చినట్లు చీల్చుచున్న శ్రీకృష్ణుని రూపంలో దుష్టుని శిక్షిస్తూ కనువిందు చేస్తాడు. (ఈ అలంకారం మారుతుంటుంది) శ్రీకృష్ణుడు గోపాలురను కాపాడినట్లు వేంకటకృష్ణుడు దుర్జనుల బారినుండి భక్తులను కాపాడుతాడు.

## 6. కల్పవృక్షవాహనం

నాలుగవనాడు పగలు శ్రీదేవి భూదేవి సహితుడై మలయప్పస్వామి కల్పవృక్షవాహనంపై విహరిస్తూ భక్తులను అలరిస్తాడు." ఎల్ల ఋతువులందు నెలరారి పరువమై కోరివచ్చువారి కోర్కుల నీనెడు వేల్పుమాను పాలివెల్లి బుట్టె" (దేవతలు, రాక్షసులు పాలసముద్రాన్ని అమృతం కొరకు చిలుకుతున్నప్పుడు అన్ని ఋతువులలోను పచ్చగానుండి కోరినవారి కోరికలను తీర్చునట్టి కల్పవృక్షం పాలసముద్రం నుండి పుట్టినది.) కల్పవృక్షం ఐహికసుఖాలనుమాత్రమే ప్రసాదిస్తుంది. కల్పవృక్షవాహనం మీద నున్న వేంకటేశ్వరుడు ఐహిక, ఆముష్మిక సుఖములను ప్రసాదిస్తాడు. స్వామి ఆశ్రితజనకల్పవృక్షం. భక్తజనమందారం. వేంకటేశ్వరస్వామి (శ్రీమన్నారాయణుని అర్చావతారం) కృష్ణావతారంలో సత్యభామ కోరికను తీర్చడంకోసం పారిజాతవృక్షాన్ని దివి నుండి భువికి దెచ్చి ప్రతిష్ఠించాడు. ఇప్పుడు కలియుగంలో ఆశ్రితభక్తజనుల కోరికలను తీర్చడం కోసం కల్పవక్షవాహనంపై విహరిస్తున్నాడు. స్వామి కల్పవృక్షవాహనంపై విహరిస్తున్నాడు. స్వామి కల్పవృక్షవాహనంపై గోవులను కాపాడుతున్న గోపాలునిరూపంలో భక్తులకు కనువిందు చేస్తాడు. (ఈ ఆలంకారము మారుతుంటుంది). గోవులను కాపాడిన గోవిందుడు భక్తజనులను కాపాడుతాడు. కల్పవృక్షం భూమీరుహ చక్రవర్తి. త్రిజగత్ సంపూజ్యదాతృత్వ కీర్తిగలది. అది ఇప్పుడు స్వర్గలోకంలో వుంది. ఈ కలియుగంలో ఆశ్రితజన కల్పవృక్షమైన వేంకటేశ్వరస్వామి భక్తజనుల కోరికలను తీరుస్తుంటాడు. భక్తులపాలిట కల్పవృక్షమే వేంకటేశ్వరుడు. "పండిన పెరటి కల్పకము వాస్తవ్యుండు" అన్నట్లుగా స్వామి దేవేరీ సమేతుడై భక్తజనులకు పెరటి కల్పవృక్షంగా కోరికలు దేర్చే చింతామణిగిరి (వేంకటాద్రికినామాంతరం) పై ఉన్నాడు.



## 7. సర్వభూపాల వాహనం

బ్రహ్మోత్సవాలలో నాలుగవనాటి రాత్రి మలయప్పస్వామి శ్రీదేవి భూదేవులతో కూడి సర్వభూపాలవాహనం పై తిరుమల మాడవీధులలో విహరిస్తాడు. ఇది ఒక సువర్ణమండపం. రాత్రిపూట విద్యుద్దీపకాంతులలో మిరుమిట్లు గొలిపే బంగారుమండపంలో స్వామి దేవేరులతో దర్శనమిస్తాడు. వేంకటేశ్వరుడు సర్వభూపాల మౌళిమణిరంజిత పాదపీఠం గలవాడు. స్వామి సర్వభూపాలురకు చక్రవర్తిసార్వభౌముడు కనుక ఉదయాస్తాచల సేతుశీతనగ మధ్యలో నున్న రాజులందరు ఈ ఉత్సవంలో వాహనంగా పాల్గొంటారు భక్తి ప్రపత్తులతో, సర్వభూపాలురలో అష్టదిక్పాలకులయిన దేవతలు కూడ ఉన్నారు.

**సేవాపరాః శివసురేశ కృశాను ధర్మ**
**రక్షోంబునాథ పవమాన ధనాధినాథాః**
**బద్ధాంజలిప్రవిలసన్నిజ శీర్షదేశాః**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్॥**

అష్ట దిక్పాలకులయిన శివుడు, ఇంద్రుడు, అగ్ని, యముడు, నిర్ఋతి, వరుణుడు, వాయువు, కుబేరుడు నిన్ను సేవించుటకై తలపై చేతులు జోడించి వేచియున్నారు. ఓ వేంకటాచలపతీ! నీకు సుప్రభాతమగుగాక! దేవతలైన దిక్పాలకులే స్వామిని సేవిస్తున్నారు. మానవపాలకులు వేంకటేశ్వరస్వామిని సేవించుట అబ్బురం కాదుగదా!

రాజులు ప్రజలకు రక్షకులు, శ్రీవేంకటేశ్వరస్వామి ప్రజలకు, రాజులకు రక్షకుడు. సర్వభూపాలురకు అధిపతి. కనుక నేడు సర్వభూపాలురు స్వామికి వాహనంగా నిలిచి సేవిస్తున్నారు. భక్తులారా! మీరు మీ హృదయాన్ని స్వామికి వాహనంగా (నిలయంగా) చేసి, స్వామిని సేవించి తరించండని

బోధిస్తున్నాడు. సర్వభూపాలవాహనంలో స్వామి కాళియ మర్దనం చేస్తున్న కృష్ణనిరూపంలో దర్శనమిస్తాడు. (ఈ అలంకారం మారుతుంటుంది).

## 8. మోహినీ అవతారం

అయిదవనాటి పగలు వేంకటాచలపతి మోహినీరూపం ధరించి రాక్షసులను మోహింపజేసిన జగన్మోహినిగా బంగారుపల్లకిలో సిగ్గులు సోయగాలు ఒలకబోయుచు భక్తులకు దర్శనమిస్తాడు. శ్రీకృష్ణుడు దంతపువల్లకిపై వెంబడే వస్తుంటాడు. విష్ణుదేవుని మోహినీ అవతారవృత్తాంతం భాగవతంలో కడురమణీయంగా వర్ణించబడింది, దేవతలు రాక్షసులు వైరము మాని అమృతంకోసం కలిసి పాలసముద్రాన్ని చిలుకుతారు. చివరలో పాలసముద్రం నుండి అమృతం లభిస్తుంది. దానికై దేవతలు, రాక్షసులు తగవు లాడుకొంటారు. ఆ సందర్భంలో జగన్నాటక సూత్రధారి విష్ణుదేవుడు జగన్మోహినీ రూపంలో అవతరించి, రాక్షసులను మోహింపజేసి, వారి వద్దనున్న అమృతభాండం తీసికొని దేవతలకు అమృతం పంచిపెడతాడు. ఇట్లు మోహినీ అవతారం బలవంతులమని అహంకరించి యున్న రాక్షసులకు అమృతం లభించకపోవుటకు, జగన్నాథుని ఆశ్రయించిన దేవతలకు అమృతం లభించుటకు కారణమయింది.

మలయప్పస్వామి మోహిని అలంకారంలో నిల్చున్నభంగిమలో కాకుండా కూర్చున్న భంగిమలో కనిపిస్తాడు. స్త్రీలు ధరించే అన్ని ఆభరణాలతో స్వామి అలంకరించబడతాడు. మలయప్పస్వామికి పట్టుచీర, కిరీటంపైన రత్నఖచితమైన సూర్యచంద్ర సావేరిని అలంకరిస్తారు. స్వామివారి ముక్కుకు వజ్రపు ముక్కుపుడక, ముత్యాల బులాకిని అలంకరిస్తారు. ఊర్ధ్వ హస్తాలలో వుండే శంఖచక్రాల స్థానంలో రెండు వికసించిన పద్మాలను అలంకరిస్తారు. వరదభంగిమలో వుండే స్వామి వారి కుడి చేయి మోహిని అలంకరణలో అభయహస్తంగా వుంటుంది. ఈ



మనోహరమైన రూపంలో స్వామివారు భక్తులకు కనువిందు చేస్తుంటారు. బ్రహ్మోత్సవాలలో అన్ని వాహన ఊరేగింపులు వాహన మండపం నుండి ప్రారంభమౌతుంది. మోహిని అవతారం మాత్రం శ్రీవారి ఆలయం నుండి ప ల్లకిపై రావడంతో ఊరేగింపు ప్రారంభమౌతుంది. శ్రీ వేంకటేశ్వరస్వామి మోహిని అవతారంలో బలగర్వితులు, అహంకారులు కార్యఫలితాన్ని పొందలేరని, వినయ విధేయతలతో భగవంతుని ఆశ్రయించినవారే కృషి ఫలితాన్ని పొందగలరని హితం ఉపదేశిస్తున్నాడు. మోహినీ అవతారం వలె బ్రహ్మోత్సవాలలో అన్ని వాహనసేవలు ఇతిహాస కథాఘట్టాలు, పురాణకథా సన్నివేశాలు ప్రాతిపదికగా కల్గివున్నాయి. ఇవి భగవంతుని విష్ణుదేవుని – సర్వవ్యాపకత్వాన్ని, సంరక్షకత్వాన్ని తెలియజేస్తున్నాయి. 'సర్వం విష్ణుమయం జగత్' అను సందేశాన్ని వినిపిస్తున్నాయి.

## 9. గరుడసేవ

**కపిలాక్షం గరుత్మంతం సువర్ణసదృశప్రభమ్**
**దీర్ఘబాహుం బృహత్స్కంధం వందే నాగాంగభూషణమ్॥**

తిరుమలలో జరిగే నవాహ్నిక బ్రహ్మోత్సవాలలో అయిదవనాటి రాత్రి జరిగే గరుడోత్సవం ప్రథమగణ్యమైంది. "వేదాత్మా విహగేశ్వరః" అనుసూక్తిని అనుసరించి గరుత్మంతుడు వేదస్వరూపుడు. వైదికములయిన సామాదులకు ప్రతిరూపాలైన అంగప్రత్యంగాలు కలవాడు గరుడుడు. విష్ణు గరుడ సమ్మేళనం వేద స్వరూప, శీర్షాలుగా వ్యక్తమవుతుంది. వేదములు ఋగ్వేదం, కృష్ణయజుర్వేదం, శుక్లయజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం అను అయిదు విభాగములుగ వుంది. కనుక తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలలో అయిదవరోజురాత్రి గరుడసేవ జరుగుచున్నది. గరుడ పంచాక్షరి (ఓం పక్షిస్వాహా) మంత్రంలో అయిదు అక్షరాలే వున్నాయి. కనుక 'పంచవర్ణ రహస్యం' అని స్తుతించబడే గరుడోత్సవం అయిదవ రోజు జరుగుచున్నది.

'కంచి గరుడ సేవ' పాతమాట! తిరుమల గరుడసేవ అత్యంతవైభవంగా అశేషజనావళి దర్శించుచుండగా జరుగుచున్నది. గరుడసేవనాటి రాత్రి తిరుమల అంతా దేశం నలువైపుల నుండి వచ్చిన లక్షలాది భక్తజనులతో ఇసుక వేస్తే నేల రాలనంతగా నిండిపోవడం ప్రత్యక్షానుభవం!

"శ్రీశేషశైల గరుడాచల వేంకటాద్రి నారాయణాద్రివృషభాద్రి వృషాద్రి ముఖ్యాం" అను సప్తగిరులలో గరుడాచలం ఒకటి. వేంకటాద్రి ప్రస్తుతం తిరుమలనుండి అలిపిరి వచ్చు రోడ్డులో వినాయకుని గుడికి సమీపాన ఎగువన గరుడపక్షి ఆకారంలో కనిపిస్తుంది. ఈ కొండకు

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం గరుడాచలమ్**
**ద్వాపరే శేషశైలం చ వేంకటాద్రిం కలౌ యుగే ॥"**

త్రేతాయుగంలో గరుడాద్రి యనుపేరు ప్రధానంగా వుండేదని వామన పురాణం (24-106) చెబుతోంది. వైకుంఠంలోని వేంకటమను విష్ణుదేవుని క్రీడాపర్వతాన్ని వరాహ విష్ణుదేవుని ఆజ్ఞానుసారం గరుడుడు భూమికి తీసుకొని వచ్చి సువర్ణముఖినదికి ఉత్తరంగా ప్రతిష్ఠించినాడు. కనుక ఈ పర్వతానికి గరుడాద్రియను పేరు గలిగింది. ఈసంగతిని మార్కండేయ పురాణం.

**వైకుంఠలోకాత్ గరుడేన విష్ణోః**
**క్రీడాచలో వేంకటనామధేయః**
**ఆనీయ చ స్వర్ణముఖీసమీపే**
**సంస్థాపితో విష్ణునివాసహేతోః ॥** అని వివరించింది. 2-67

మహర్షులు గరుడాద్రిని - వేంకటాద్రిని - వేదస్వరూపంగా వర్ణించారు.



**అరాయికాణే గరింగచ్ఛేతి తం విదుః**
**ఏవం వేదమయః సాక్షాత్ గిరీంద్రః పన్నగాచలః॥**

-పురుషార్థకాముకుడా! నీ అభీష్టసిద్ధికై శ్రీనివాసుని నిలయమగు వేంకట పర్వతానికి వెళ్ళమని ఋగ్వేదం (10-155-1) ఉపదేశిస్తున్నది. ఇట్లు శేషాచలం వేదస్వరూపమైయున్నది. శేషాచలానికి నామాంతరమే గరుడాచలం. గరుడుడు వేదస్వరూపుడు.

**దాసో మిత్రం తాళవృంతం వితానం**
**పీఠం వాసో వాహనం చ ధ్వజశ్చ**
**ఏవం భూత్వాఽనేకధా సర్వథా సః**
**శ్రీశం శ్రీమాన్ సేవతే వైనతేయః ॥**

దాసుడుగా, మిత్రుడుగా, విసనకర్రగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజంగా అనేక విధాలుగా వినతాసుతుడు శ్రీనివాసుని సేవించు చున్నాడు. గరుడుడు విష్ణుదేవునికి వాహనం, ధ్వజంకూడ, కనుక గరుడధ్వజం ఎగురవేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పూర్తి అవుతాయి. గరుడుడు ధ్వజస్తంభం మీద నిలిచి ముక్కోటి దేవతలను శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తుంటాడు. దేవతలు అదృశ్యులుగా (మానవుల కంటికి కనిపించకుండా) శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాల్గొని ధన్యులై స్వస్థానాలు చేరుతారు.

తొమ్మిదిరోజుల వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ఐదవరోజు రాత్రి జరిగే గరుడవాహన ఉత్సవంలో మలయప్పస్వామిని మూలమూర్తికి నిత్యం అలంకరించియుండే మకరకంఠి, లక్ష్మీహారం, వేంకటేశ సహస్రనామమాల మొదలగు విశిష్టాభరణాలతో అలంకరిస్తారు. గరుడోత్సవంలో స్వామి ఒక్కడే

పాల్గొంటాడు. దేవేరులు వుండరు. గరుడ సేవలో ధ్రువమూర్తి వేంకటేశ్వరస్వామికి, ఉత్సవమూర్తి మలయప్పస్వామికి భేదం లేదన్నది సంప్రదాయం. కనుక ఈ సమయంలో ఉత్సవమూర్తి దర్శనం అత్యంత శుభప్రదం. మోక్షదాయకం. ఆనాడే తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరుక్షేత్రం నుండి అక్కడవున్న గోదాదేవికి – ఆండాళ్‌కు – అలంకరించిన పూలమాలలను – ఆముక్తమాలలను – గరుడోత్సవం నాటికి ఉత్సవంగా తిరుమల తెప్పించి వేంకటేశ్వరస్వామికి అలంకరిస్తారు. ఈ సంప్రదాయానికి మూలమైన ఇతిహాసం యిట్లున్నది.

క్రీ.శ. 1516 సంవత్సరంలో విజయనగర ప్రభువు శ్రీకృష్ణదేవరాయలు కళింగదేశంపై జైత్రయాత్రకు వెళ్ళుతూ దారిలో బెజవాడ (విజయవాడ)లో కొన్ని రోజులు విడిది చేశాడు. ఆ కాలంలో వచ్చిన హరివాసరం (ఏకాదశి) నాడు రాయలు బెజవాడ నుండి కృష్ణానదీ తీరాన వున్న శ్రీకాకుళం పుణ్యక్షేత్రంలో వెలసియున్న ఆంధ్ర విష్ణుదేవుని దర్శించినాడు. ఏకాదశినాడు రాయలు ఉపవాసం ఉన్నాడు. ఆ రాత్రి నాల్గవ జాములో రాయలకు ఆంధ్రవిష్ణుదేవుడు కలలో కనిపించి " కృష్ణరాయా! మాకు ప్రీతి గలుగునట్లుగా ఆంధ్రభాషలో ఒకకావ్యం రచించు. నన్ను గురించి పురాణకథలు అనేకం వున్నాయి. వాటిలో ఏ కథను కావ్యంగా రచించాలి అని నీవు అడిగితే పూర్వం తన తలపై అలంకరించుకొనిన పూలదండలను తీసి నాకు సమర్పించిన చిన్న దానిని నేను శ్రీరంగంలో పెండ్లియాడినకథను – గోదాకల్యాణ కథను – కావ్యంగా రచించు. పూర్వం నేను కృష్ణావతారంలో సుదాముడు ఇచ్చిన పూలదండను ఏవగింపుతో స్వీకరించాను. ఆ కొదువ తొలగించుటకు ప్రియా పరిభుక్తభాక్కథను తెలుగుభాషలో కావ్యంగా రచించు." అని రాయలను కోరినాడు. పిమ్మట ఆంధ్రవిష్ణుదేవుడు ఆముక్తమాల్యద కావ్యాన్ని ఎవరికి అంకితం చేయాలి? అంటే కృష్ణరాయా! నీకు వేంకటాచలపతి ఇష్టదైవం. కనుక ఈ కావ్యాన్ని వేంకటపతికే



అంకితంచేయి. మేము ఇరువురుగా కన్పించడం కేవలం సంకేతం. యథార్థమునకు అతడే నేను. నేనే అతడు. మాకు భేదం లేదు అని వివరించాడు. (ఆముక్తమాల్యద, 1-14-16)

ఇందువలన శ్రీకాకుళ ఆంధ్రవిష్ణు దేవునికి తిరుమల వేంకటేశ్వరునకు భేదం లేదని, ఇరువురు ఒకడే అని, వారిద్దరు శ్రీమన్నారాయణుని అర్చావతారాలేయని స్పష్టమగుచున్నది. శ్రీకృష్ణదేవరాయలు కళింగ దేశ జైత్రయాత్ర ముగిసిన తర్వాత తెలుగు భాషలో గోదాదేవి కల్యాణకథను 'ఆముక్తమాల్యద' అను పేరుతో ఒక ప్రబంధాన్ని రచించి, ఇష్టదైవమైన వేంకటాచలపతికి అంకితమిచ్చి ఆంధ్ర విష్ణుదేవుని కోరికను తీర్చినాడు. అంతేగాక కృష్ణరాయలు ఆంధ్రదేవుని అభిలాషను నెరవేర్చినాడు. ఇట్లు, రాయలు దక్షిణాపథచక్రవర్తి. తమిళదేశంలో గోదాదేవి జన్మస్థలమైన శ్రీవిల్లిపుత్తూరు ఉంది. అక్కడ గోదాదేవి ఆలయం వుంది. అక్కడ గోదాదేవికి అలంకరించి తొలగించిన పూలమాలలను తిరుమలకు తెప్పించి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో ప్రధానమైన గరుడసేవనాడు స్వామికి అలంకరించి, ఊరేగించునట్లు ఏర్పాటు చేశాడు. ఈ ఆంధ్ర విష్ణుదేవుని ప్రియా పరిభుక్త భాక్కథ నేటికీ జరుగుతున్నది. కృష్ణరాయలు వేంకటేశ్వరునికి సమర్పించిన సువర్ణాభరణాలు, భూములు మాయమైనా ఆముక్తమాలల సమర్పణ, అలంకరణ సంప్రదాయం మాత్రం నేటికీ అవిచ్ఛిన్నంగా కొనసాగుతోంది. ఇందుకు కృష్ణరాయలు రచించిన ఆముక్తమాల్యద ప్రబంధం సాక్షిగావుంది. కృష్ణరాయలు ధన్యుడు. కృతార్థుడు.

రాష్ట్రప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి సమర్పించిన నూతన పట్టు వస్త్రాలను గరుడసేవనాడు స్వామివారికి అలంకరిస్తారు. అంతేగాక చెన్నపట్టణంలోని మిరాశిదారులు సమర్పించిన కొత్తగొడుగులతో గరుడోత్సవం కడువైభవంగా జరుగుతుంది.

**గోదాసమర్పిత సువాసిత పుష్పమాలాం**
**లక్ష్మీహార మణిభూషిత సహస్రనామ్నాం**
**మాలాం విధార్య గరుడోపరి సన్నివిష్టః**
**శ్రీవేంకటాద్రినిలయో జయతి ప్రసన్నః॥**

–గోదాదేవి సమర్పించిన ఆముక్తపుష్పమాలలను, లక్ష్మీహారాన్ని సహస్రనామహారాన్ని ధరించి, గరుడవాహనంపై ఆసీనుడైన వేంకటాద్రి విభుడు ప్రసన్నుడై వర్ధిల్లుచున్నాడు.

ప్రతి సంవత్సరం గరుడోత్సవంనాడు చెన్న పట్టణంలోని తిరుపతి అంబ్రెల్లా ఛారిటీస్ వారు (ప్రస్తుతం హిందూ ధర్మార్థ సమితి) వేంకటేశ్వర స్వామివారికి తొమ్మిదిగొడుగులను (ఆరుపెద్ద గొడుగులు, మూడు చిన్న గొడుగులు) నూతనంగా తయారుచేసి, పూజలుచేసి చెన్నైనుండి వూరేగింపుగా కాలినడకన తిరుమలకు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో సమర్పిస్తారు. ఈ గొడుగులతోపాటు గొడుగుల మిరాశిదార్లు శ్రీవారి పూలంగి కపాయి, కుల్లాయి, వక్షః స్థల లక్ష్మీదేవికి పావడలు, తిరుచానూరు పద్మావతీదేవికి రెండు పెద్దగొడుగులు, కపాయి, పసుపు కుంకుమ చందనం మొదలగువాటిని "శ్రీవారి సారె" గా పేర్కొంటూ ఒక వెదురు బుట్టలో సమర్పిస్తారు. కొత్తగొడుగులను, సారెపెట్టెను దేవస్థానం అధికారులు మిరాశిదారులకు అన్ని మర్యాదలు జరిపి స్వీకరిస్తారు. ఈ విధంగా శ్రీవేంకటేశ్వరస్వామి గరుడోత్సవం విశిష్టమైన విలువైన ఆభరణాలంకారాలతో, నూతన పట్టు వస్త్రాలతో, కొత్తగొడుగులతో అంగరంగవైభవంగా కన్నుల పండువుగ జరుగుతుంది. ఈ గరుడోత్సవ వైభవాన్ని అన్నమాచార్యులు

**పల్లించి గరుడునిపై నీవుబ్బున నెక్క.....**
**బంగారు గరుడునిపై నీవు వీధులేగ**



**చెంగట శ్రీ వేంకటేశ్వర సిరులు మూగె**
**సంగతి నలమేల్మంగ సంతసాన విర్రవీగె**
**పొంగారు దేవదుందుభులు పైపై వాగె**

–11–70

అని వర్ణించినాడు. ఆనాటి కోలాహలాన్ని, ఉత్సవ సంరంభాన్ని

**ఇటు గరుడుని నీ వెక్కినను**
**పటపట దిక్కులు బగ్గన పగిలె** – 2–92

అని వర్ణిస్తూ శ్రీ వేంకటేశ్వరునిమహిమను అన్నమయ్యవేనోళ్ల కీర్తించినాడు. గరుడోత్సవంలో మలయప్పస్వామి ఒక్కడే

**"చివురు చొట్లపుదోయి జెందమ్ములన దార్క్ష్య**
**హస్తోదరముల దివ్యాంఘ్రు లమర"**

వేంకట విష్ణుమూర్తి గరుడుని చిగుళ్ళ పొట్లాల వంటి రెండు అరచేతులలో ఎర్రదామరలవలె నున్న తన రెండు పాదాలను పెట్టి వైభవం ఒలక బోస్తూ దర్జాగా కూర్చొని యుంటాడు. ఇట్లుండుట తన రెండు పాదాలే భక్తులకు ఉపాయాలు, ఉపేయాలని సూచిస్తున్నది. ఇదే ద్వయమంత్రసారం. ఇట్లు గరుడసేవ ద్వయ మంత్రార్థానికి ప్రతీకగా వుంది. భవతు.

గరుడ వాహనారూఢుడైన విష్ణుదేవుని దర్శించి, మైమరచి పెరియాళ్వారు (విష్ణు చిత్తుడు) పల్లాండు, పల్లాండు అంటూ మంగళాశాసనం చేశాడు. "గరుడ గమన రారా! నను కరుణ నేలుకోరా!" అంటూ రామదాసు ప్రార్థించాడు.

**"దాసవర్గముల కెల్లా దరిదాపు మీరేకాన**
**వాసికి నెక్కించరాదా వసుధలో మమ్మును**

**ఆయితమై గరుడుండ! అట్టే మీరూ చేయరాదా**
**యేయెడ విన్నపము మాకేమి వలసినాను"**

–అని అన్నమాచార్యులు తనకొరకు, మనకొరకు వేంకటేశ్వర స్వామికి విన్నపంచేయుమని గరుడునికి విన్నపంచేస్తున్నాడు. ఇది వేంకటేశ్వరుని గరుడసేవ వైభవం.

వేంకటేశ్వరస్వామి "భక్తులారా! సర్వకాల సర్వావస్థలయందు మీ రక్షణకై శంఖచక్రాది ఆయుధాలను ధరించి గరుడుని అధిరోహించి సంసిద్ధుడనై యుంటాను. నన్ను శరణు వేడండి. నా పాదాలను ఆశ్రయించండి. మీ రక్షణభారం నాకు వదిలేయండి. మిమ్ము తప్పక రక్షిస్తాను" అని హితం ఉపదేశిస్తుంటాడు. కనుక వేంకటేశ్వరస్వామి వారి గరుడోత్సవం సర్వపాపహరం, సకల సంపత్కరం. శ్రేయోదాయకం.

## 10. హనుమద్వాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటిపగలు వేంకటేశ్వరస్వామి ఒక్కడే హనుమంతుని వాహనంగా చేసికొని ఊరేగుతూ త్రేతాయుగం నాటి శ్రీరాముడను నేనే అని పలుకుతున్నట్లు వేంకటాద్రిరాముడుగా భక్తులకు దర్శన మిస్తాడు.

**కృతే తు నారసింహోఽభూత్ త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకటనాయకః॥**

– కృతయుగంలోని నరసింహస్వామి, త్రేతాయుగంలోని శ్రీరాముడు, ద్వాపరయుగంలోని శ్రీకృష్ణుడు, కలియుగంలోని వేంకటేశ్వరుడు ఒక్కరే. అందరు విష్ణుదేవుని అవతారపురుషులే. అందుకే.

**కౌసల్యా సుప్రజారామ పూర్వా సంధ్యా ప్రవర్తతే**
**ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥**



అంటూ ప్రతిరోజు ఆ రాముని పేరుతోనే మేలు కొలుపులు పాడించుకొంటూ సుప్రభాతసేవ చేయించుకొంటున్నాడు వేంకటేశ్వరుడు. లోకహితం కోసమే నేను త్రేతాయుగంలో శ్రీరామునిగ, కలియుగంలో వేంకటేశునిగా అవతరించాను. ఆ విషయాన్ని జ్ఞాపకం చేయడం కోసమే నేడు అనన్య భక్తుడైన హనుమంతుని అధిరోహించి మీకు వేంకటాద్రి రామునిగా కనిపిస్తున్నాను అని బోధిస్తున్నాడు వేంకటేశ్వరుడు. హనుమంతుడు దాస్యభక్తికి ప్రతీక. ఆదర్శం. భక్తజనులారా! మీరు హనుమంతునివలె నాకు దాసులై, అనన్యభక్తులై అభీష్టసిద్ధిని పొందండి. కృతార్థులుకండి. తరించండి అని ఉపదేశిస్తున్నాడు.

రామరావణయుద్ధంలో రావణుడు రథంపైనుండి యుద్ధం చేయుచుండగా శ్రీరాముడు హనుమంతుని భుజాన్నెక్కి రావణునితో యుద్ధం చేశాడు. హనుమంతుడు భగవంతునికంటె భక్తుడే బలవంతుడని నిరూపించాడు. భగవంతునికంటె భగవన్నామమే శరణ్యమని దృఢపరచినాడు. దేశంలో శ్రీరాముని భక్తులకంటె హనుమంతుని భక్తులే అధికంగా వున్నారు. కేసరి భార్య అంజనాదేవి వేంకటాద్రిలో ఆకాశ గంగా తీర్థ సమీపంలో తపస్సు చేసి, తపః ఫలితంగా హనుమంతుని ప్రసవించింది. కనుక హనుమంతుని జన్మస్థానం ఆకాశగంగాతీరం. అక్కడ వున్న పర్వతానికి అంజనాచలమనే పేరు గలిగింది. అంజనాపుత్రుడు అంజనాద్రీశునకు వేంకటేశ్వరునకు వాహనమైనాడు.

తాళ్ళపాక అన్నమాచార్యులు హనుమంతుని వైభవాన్ని యిట్లు కీర్తించాడు.

**"ఇతడే యతడు గాబో లేలిక బంటును నైరి**
**మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు**
**జలధి బంధించి దాటి చలపట్టి రాఘవుడు**

**అలరి వూరకే దాటే హనుమంతుడు**
**అలుకతో రావణుని యదటణచె నతడు**
**తలచి మైరావణుని దండించె నితడు"**

శ్రీవైష్ణవ సంప్రదాయంలో గరుడుని 'పెరియతిరువడి' గాను హనుమంతుని 'సిరియతిరువడి' గాను గౌరవిస్తున్నారు. అందుకు కారణం గరుత్మంతుడు అన్నియుగాలలో సదా విష్ణుదేవుని వాహనం, సేవకుడు. హనుమంతుడు త్రేతాయుగంలో మాత్రమే శ్రీరాముని సేవించి, తరించినాడు.

## వసంతోత్సవం – బంగారు రథోత్సవం

ఆరవనాటి మధ్యాహ్నమున శ్రీదేవీ భూదేవీ సమేతుడైన మలయప్పస్వామికి వసంతోత్సవం జరుగుతుంది. ఈ వసంతోత్సవం దేవాలయంలోని రంగనాయకుల మండపంలో జరుపబడుతుంది. ఈ ఉత్సవం క్రీ.శ. 1993 సంవత్సరం నుండి జరుగుతున్నది. ఈ రోజు సాయంత్రం శ్రీదేవీ భూదేవీ సమేతుడయిన మలయప్పస్వామి సువర్ణరథాన్ని అధిరోహిస్తాడు. సంధ్యాసమయంలో సూర్యుని అరుణకిరణ కాంతులు ప్రసరించుచుండగా దివ్యకాంతులీనుచున్న బంగారు రథంలో వేంకటేశ్వర స్వామి దేవేరులతో తిరుమల నాలుగు మాడవీథులలో విహరిస్తూ భక్తులకు కనువిందు చేస్తాడు. బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం జరిగే ఉయ్యాలసేవ ఈరోజు (హనుమంతుని వాహనం నాడు) జరుగదు. వసంతోత్సవానంతరం జరిగే స్వర్ణరథోత్సవాన్ని "సువర్ణరథరంగ డోలోత్సవం" అని వ్యవహరిస్తున్నారు. సువర్ణ రథోత్సవంలో కల్యాణకట్ట సంఘం వారు సమర్పించిన బంగారు గొడుగును రథంపై అలంకరిస్తారు.



## 11. గజవాహనం

బ్రహ్మోత్సవాలలో ఆరవనాటి రాత్రి మలయప్పస్వామి ఒక్కడే గజరాజుపై ఊరేగుతూ భాగవతంలోని గజేంద్రమోక్షం వృత్తాంతాన్ని స్మరింపజేస్తాడు. భక్తజనులారా! ఈ గజరాజు బలగర్వితుడు. ఒకనాడు జలక్రీడలాడుతూ మొసలికి పట్టుబడి దానితో చాలాకాలం పోరాడి చివరకు దీనుడై

**"లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యె, బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపందగున్ దీనునిన్**
**రావే ఈశ్వర! కావవే వరద ! సంరక్షించు భద్రాత్మకా!"**

ఈశ్వరా ! బలం కొంచెమైనను లేదు. ధైర్యం నశించింది. ప్రాణాలు తమ స్థానాలనుండి తప్పుకొంటున్నవి. సొమ్మసిల్లినాను. శరీరం కృశించిపోయింది. అలసట కలుగుతున్నది. ఇక మొసలితో పోరాడలేను. నిన్నే తప్ప మరొక రక్షకుని ఎరుగను. ఈ దీనుని నీవే రక్షించాలి. ఈశ్వరా! వేగరమ్ము వరదా! నన్నుకాపాడు. పరమాత్మా! నన్ను రక్షించు, అని శరణు వేడినాడు. ఆ క్షణమే విశ్వమయుడైన విష్ణుదేవుడు" అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు దాపల మందారవనాంత రామృతసరః ప్రాంతేందు కాంతోపలోత్పల పర్యంక రమావినోది" యైనను ఆపన్న ప్రసన్నుడై వైకుంఠం నుండి భారతదేశానికి వచ్చి, మొసలిని సంహరించి గజరాజును కాపాడినాడు. కనుక భక్తులారా! మీరు కూడ స్వశక్తిపై, బలంపై ఆధారపడకుండా మీ రక్షణభారం నామీద ఉంచండి. నేను మిమ్మల్ని తప్పక రక్షించుతాను అని గజవాహనడైన వేంకటేశ్వరుడు ఉపదేశమిస్తున్నాడు.

సంసారం ఒక సరస్సు. మొసలి కర్మ. గజేంద్రుడు జీవుడు. సంసారం నుండి కర్మనుండి విముక్తిని ప్రసాదించే వాడు విష్ణుదేవుడు. ప్రతిభక్తుడు ఒక గజేంద్రుడు. సంసారబంధంనుండి, కర్మబంధం నుండి విముక్తిని ప్రసాదించేవాడు వేంకటేశ్వరుడు. కనుక వేంకటేశ్వరుని శరణు వేడుకోవాలి.

రాజలాంఛనాలలో, చతురంగబలంలో గజబలం ఒకటి. నేటికీ గజారోహణం (ఏనుగుపై ఊరేగడం) గొప్ప గౌరవం. విశిష్ట సన్మానం. శరణాగతి ప్రయోజనాన్ని వివరించే పురాగాథ గజేంద్రమోక్షం.

బ్రహ్మోత్సవాలలో వేంకటేశ్వరుడు ఒక్కడే గజారూఢుడై ఊరేగుతాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు అలమేలుమంగతో కలిసి గజారూఢుడైన వేంకటేశ్వరుని విలాసవైభవాన్ని ఇట్లు మనోహరంగా వర్ణించాడు.

**చొల్లెపుజుట్టుతోడి చుంగుల రాజసముతో**<br>
**వెల్లివిరిగా నేగి వెలదులు గొలువ**<br>
**వీపు గుచాలుమోపి వెలది కౌగిలించగా**<br>
**నేపున నేనుగు నెక్కి నిదె దేవుడు**<br>
**చేపట్టి యాపె చేతులు బిగ్గెబట్టుక**<br>
**పైపై వీథుల వెంట బరువు దోలీని**

–అన్నమాచార్యసంకీర్తనలు, 13–58

## 12. సూర్యప్రభ వాహనం

**భాస్కరాయ విద్మహే**<br>
**మహాద్యుతికరాయ ధీమహి**<br>
**తన్నో ఆదిత్యః ప్రచోదయాత్ ॥**



అని సూర్యగాయత్రి. ఏడవరోజు పగలు సప్తాశ్వరథారూఢుడైన సూర్యప్రభవాహనంపై సప్తగిరీశ్వరుడు వేంకటేశ్వరుడు ఒక్కడే వజ్రకవచం ధరించి ఉదయసూర్యకిరణాలు ప్రసరించుచుండగా తిరుమల నాలుగు మాడవీధులలో ఊరేగుతూ సూర్యమండలం మధ్యనున్న నారాయణమూర్తిని నేనే అని భక్తులకు బోధిస్తున్నాడు. "జ్యోతిషాం రవి రంశుమాన్" జ్యోతి స్వరూపాలలో సూర్యుడను నేను అని కృష్ణభగవానుని మాట. భగవంతుని స్వరూపమే తేజస్సు. అది సూర్యభగవానునిలో ప్రముఖంగా వుంది.

**"ధ్యేయస్సదా సవితృమండలమధ్యవర్తీ నారాయణః"**

–సూర్యమండలం మధ్యలో వున్న శ్రీమన్నారాయణుడు ఎల్లప్పుడు ధ్యానింపదగియున్నాడు అని వేదవచనం. అందుకే భారతీయులు ప్రతిరోజు ఉదయం సూర్యోపాసన, సూర్యనమస్కారాలు చేస్తున్నారు. గాయత్రీ మంత్రంతో సూర్యనారాయణుని ఆరాధిస్తున్నారు. సూర్యుడు తేజోనిధి. ప్రకృతికి, జీవులకు చైతన్యప్రదాత. వర్షాలు, వాటివలన పెరిగే పైరు పంటలు, చంద్రుడు, అతని వలన వృద్ధిచెందే ఓషధులు మొదలగు నవి అన్నీ సూర్యప్రభవల్లనే వృద్ధి చెందుతున్నాయి.

ప్రపంచానికి వెలుగు ప్రసాదించే సూర్యనారాయణుడను నేనే అని వేంకటేశ్వరస్వామి సూర్యప్రభ వాహనంపై భక్తజనులకు దర్శనభాగ్యం కలిగించి ఆరోగ్య, ఐశ్వర్యాలను అనుగ్రహిస్తున్నాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు సూర్యప్రభ వాహనంపైనున్న వేంకటేశ్వరుని

**"ఉవిద వదనచంద్రోదయవేళను**<br>
**రవియగు సూర్యప్రభ నీ వేగగ** –30–197

అని వర్ణించాడు. మరోచోట అన్నమాచార్యులు

**అదివో చూడరో అందరు మ్రొక్కరో**
**గుదిగొనె బ్రహ్మము కోనేటి దరిని**
**రవిమండలమున రంజిల్లు తేజము**
**దివి చంద్రునిలో తేజము**
**భువి ననలంబున బొడమిన తేజము**
**వివిధంబులైన విశ్వతేజము** –2–498

అని వేంకటేశ్వరుడే సూర్యమండల మధ్యవర్తియగు శ్రీమన్నారాయణు డని ధ్రువపరిచినాడు. కీర్తించినాడు.

## 13. చంద్రప్రభ వాహనం

ఏడవనాటిరాత్రి వేంకటేశ్వరుడు చల్లని వాతావరణంలో చంద్రప్రభ వాహనంపై తిరుమల మాడవీథులలో విహరిస్తాడు. వేంకటాద్రి విష్ణుదేవునికి సూర్యచంద్రులు రెండు నేత్రాలు. పగలు సూర్యప్రభలో ఊరేగిన వేంకటాద్రి విష్ణుదేవుడు రాత్రి నిశాకరుడైన అమృతకిరణాలు గలిగిన చంద్ర ప్రభ వాహనంపై ఊరేగుతాడు. శ్రీకృష్ణభగవానుడు "నక్షత్రాణా మహం శశీ" – చుక్కలలో చంద్రుడను నేను – అని తెలియజేసినాడు. "చంద్రమా మనసో జాతః" అని పురుషసూక్తం భగవంతుని మనస్సు నుండి చంద్రుడు జన్మించినాడని వివరిస్తున్నది. సూర్యుడు దివాకరుడు కాగా చంద్రుడు నిశాకరుడు. సూర్యకాంతితోనే చంద్రుడు ప్రకాశిస్తాడు. కనుక పగలు సూర్యప్రభవాహనం జరిగిన తర్వాత రాత్రిపూట చంద్రప్రభవాహనం జరుగుతున్నది. చంద్రుడు అమృతకిరణాలు గలవాడు. వేంకటేశ్వరుడు దేవతలకు అమృతం పంచిపెట్టిన మోహిని అలంకారంతో అమృత కలశంతో దర్శనమిస్తూ భక్తులకు అమృత విద్యను బోధిస్తుంటాడు. "యథా ప్రహ్లాదనాత్ చంద్రః" – చంద్రుని వలన సంతోషం గలుగుతుంది. అట్లాగే చంద్రప్రభ



వాహనంపై ఊరేగుతున్న వేంకటేశ్వరస్వామి దర్శనం భక్తులకు సంతోషాన్ని కల్గిస్తుంది. సూర్యుని తీక్ష్ణత్వం, చంద్రుని శీతలత్వం రెండూ తన స్వరూపమేనని వేంకటేశ్వరుడు సూర్యప్రభ, చంద్రప్రభ వాహనాల ద్వారా వెల్లడిస్తున్నాడు. సూర్యచంద్రులు భగవంతుని నేత్రాలు. మానవునికి సూర్యుని వలన దృష్టి, చంద్రునివలన మనస్సు ఏర్పడుతున్నాయి.

## 14. రథోత్సవం

శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో అత్యంతవైభవమైనది. భక్తి జనాకర్షకమైనది రథోత్సవం. ఎనిమిదవరోజు ఉదయం, ఉదయ సూర్యుని కిరణకాంతులలో మేరుపర్వతం వంటి రథంలో ఇరువైపులా శ్రీదేవీ భూదేవులు సేవిస్తుండగా మధ్యలో మలయప్పస్వామి వేంచేసి యుండగా భక్తజనులందరు గోవిందనామస్మరణచేస్తూ రథంపగ్గాలను లాగుతుండగా తిరుమల నాలుగుమాడ వీథులలో నెమ్మదిగా రథోత్సవం జరుగుతుంది. ఈ ఉత్సవం భక్తులు తేరుపగ్గాలను పట్టుకొని రథాన్ని లాగుతూ స్వయంగా పాల్గొనడం ఈ రథోత్సవం ప్రత్యేకత. ఇతర వాహన ఊరేగింపులలో భక్తులు ప్రేక్షకులు మాత్రమే. స్వయంగా పాల్గొనే అవకాశం లేదు. రథోత్సవంలో భక్తులు స్వయంగా పాల్గొనడం వల్లనే ఉత్సవం అత్యంత వైభవంగా, కోలాహలంగా వుంటుంది.

"రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే". రథంలో వేంచేసియున్న విష్ణుదేవుని దర్శనం జన్మరాహిత్యాన్ని కలిగిస్తుంది అనే విశ్వాసంతో భక్తులందరు రథోత్సవంలో స్వయంగా పాల్గొంటారు. రథోత్సవ వైభవాన్ని తాళ్ళపాక అన్నమాచార్యులు

**"దేవదేవు డెక్కె నదె దివ్యరథము**
**మా వంటివారి కెల్ల మనోరథము"** –5–225

**"మిన్ను నేలా నొక్కటైన మేటి తేరు**
**కన్నులపండువైన శ్రీకాంతుని తేరు"** -6-227

**"కన్నులపండుగలాయ గన్నవారికందరికి**
**వెన్నుడేగీ నిల్లదివో వీథులను**
**అది యెక్కె దిరుతేరు అసురులు చెదరగ**
**త్రిదశులు చెలగగ దేవదేవుడు**
**కదలె బండికండ్లు ఘనమైన మ్రోతతోడ**
**వెదచల్లు గాంతులతో వీథుల వీథులను"**
-10-178

అని మనోహరంగా వర్ణించినాడు. రథోత్సవంలో తిరువీథులలో రథం వెళ్ళుతున్నప్పుడు ఆగినచోట భక్తులు హారతులు ఇస్తుంటారు. ఈ పవిత్ర దృశ్యాన్ని అన్నమాచార్యులు.

**"ఎత్తరే ఆరతులు యియ్యరే కానుకలు**
**యిత్తల నేగి వచ్చెను యిందిరానాథుడు**

**గరుడధ్వజపుతేరు కనకమయపుతేరు**
**సిరులతో వేదముల చేరుల తేరు**
**సురలు మునులు బట్టి సొంపుతోడ దియ్యగాను**
**యిరవుగ నేగి వచ్చె యిందిరానాథుడు"** -10-31

**"వీథుల వీథుల విభుడేగీ నిదె**
**మోదముతోడుత మొక్కరో జనులు**
**గరుడధ్వజమదె కనకరథంబదె**



**అరదముపై హరి యల వాడె**
**యిరుదెసల నున్నారు ఇందిరయు భువియు**
**పరగ బగ్గములు పట్టరో జనులు"** -10-286

అని భక్తజనులకు హెచ్చరికలు చేస్తూ రథోత్సవ వైభవాన్ని విపులంగా వర్ణించాడు.

తరిగొండ వెంగమాంబ రథోత్సవవైభవాన్ని వేంకటాచల మాహాత్మ్యమనే పద్యకావ్యంలో ఇట్లు వర్ణించింది.

**పరమభాగవతులు భక్తితో బాడుచు**
**నుప్పొంగి యాడుచు నుండగాను**
**గరములు ద్రిప్పి భోగస్త్రీలు ముందర**
**జతలుగా నృత్యముల్ సలుపగాను**
**గ్రమముగా వందిమాగధ సూత బృందముల్**
**పురుషోత్తమఖ్యాతి బొగడగాను**
**శిరముల గలశముల్ జేర్చి కొందరు భక్తు**
**లొక్కెడ బ్రేరణల్ ద్రొక్కగాను**

**మొనసి కొందరు గోవింద యనుచు భక్తి**
**పరవశత్వముచే మించి పలుక గాను**
**రథముపై దండులము లనురాగయుక్తి**
**సతులు మేడలపై నుండి చల్లగాను ॥** -2-131

-శ్రీనివాసుడు దేవేరులతో రథంపై మాడవీథులలో ఊరేగుచుండగా భాగవతోత్తములు భక్తిగీతాలను పాడుచు ఉప్పొంగి ఆడుచున్నారు. రథం

ముందు భోగస్త్రీలు జతలుగా కన్నులపండువుగా చేతులు త్రిప్పుచు నృత్యాలు చేస్తున్నారు. (విజయనగర చక్రవర్తి కృష్ణదేవరాయల సోదరుడు అయిన అచ్యుతదేవరాయలు క్రీ.శ. 1529-1542) తిరుమలలో వేంకటేశ్వరస్వామి పరిచర్యకుగాను రంజకం కుప్పసాని కుమార్తె ముద్దుకుప్పాయి అను నాట్యకళావిశారదను నియమించినాడని శాసనం, 4-11 తేది: 6-6-1531 తెలియజేస్తున్నది. ఆనాడు దేవదాసీలను 'ఎంబెరుమానడియార్' అని గౌరవించేవారు. దేవదాసీలు ఊరేగింపుముందు నృత్యం చేయుటను వెంగమాంబ వర్ణించింది.) నేడు ఊరేగింపుముందు స్త్రీలు, యువతులు ప్రవేశించి భజనలు, కోలాటాలు, నృత్యాలు చేస్తూ భక్తిని ఆనందాన్ని కల్గిస్తున్నారు. వేంకటేశ్వరుని వైభవాన్ని వందిమాగధులు, సూతులు ఎలుగెత్తి పొగడుతున్నారు. భక్తులు కొందరు తలపై కలశాలను పెట్టుకొని పేరణి నృత్యాలు చేస్తున్నారు. కొందరు భక్తులు పారవశ్యంతో గోవిందా! గోవిందా! యని గొంతెత్తి పలుకుతున్నారు. కొందరు పేరంటాండ్రు మాడవీథులలో వున్న మేడలపై నుండి రథంపై సేసలు (బియ్యం) ప్రీతితో చల్లుతున్నారు. (నేడు భక్తులు రథంపై ఉప్పు, మిరియాలు, చల్లుతున్నారు.)

తిరుమల దేవాలయంగోడలపై రథోత్సవానికి సంబంధించిన శాసనాలు చాలా ఉన్నాయి. తాళ్ళపాక పెదతిరుమలాచార్యులు తన పేర ఏర్పాటు చేసిన ఆణి బ్రహ్మోత్సవంలోను మూడు రథాల్లో - బ్రహ్మదేవుడు- విష్వక్సేనుడు, - వేంకటేశ్వరుడు - పాల్గొంటుండేవారని అతడు వేయించిన ధర్మశాసనం 4-129 తేది 17-3-1539 వలన తెలుస్తున్నది. ఎట్టూరు తిరుమల కుమార తాతాచార్యులు ఏర్పాటు చేసిన అల్పిశి బ్రహ్మోత్సవంలో మూడురథాల అలంకరణ కోసం ఒక రేఖైపొన్ను, రెండుపణాలు కట్టడి చేసినట్లు అతడు వేయించిన ధర్మశాసనం 6-5 తేది 25-9-1583 వలన తెలియుచున్నది.



రథోత్సవం విశిష్టమైన తత్త్వజ్ఞానాన్ని బోధిస్తున్నది. కఠోపనిషత్తు ఆత్మకు శరీరానికి వుండే సంబంధాన్ని రథయాత్రతో పోల్చిచక్కగా వివరించింది.

**ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవ తు**
**బుద్ధిం తు సారథిం విద్ధి మనః ప్రగ్రహమేవ చ**
**ఇంద్రియాణి హయానాహుర్విషయాంస్తేషు గోచరాన్"** -3-34

-శరీరం రథం. బుద్ధి సారథి, మనస్సు కళ్ళెము. ఇంద్రియాలు గుర్రాలు, ఇంద్రియవిషయాలు అవి పరుగులు తీసేమార్గాలు. ఆత్మ (అంతర్యామిగా వున్న భగవదంశ) రథికుడు. గుర్రాలవంటి ఇంద్రియాలను మనస్సు అనెడి కళ్ళెంతో అదుపుచేసి, రథంవంటి శరీరాన్ని మీ బుద్ధియను సారథి ద్వారా చక్కని మార్గంలో నడిపించి రథికుడైన ఆత్మను - నన్ను - గుర్తించి, సేవించి, తరించండని హితబోధ చేస్తున్నాడు వేంకటేశ్వరస్వామి.

## 15. అశ్వవాహనం

బ్రహ్మోత్సవాలలో ఎనిమిదవనాటిరాత్రి వేంకటేశ్వరస్వామి ఒక్కడే శిరస్త్రాణాన్ని ధరించి, ఖడ్గం చేతపట్టి యుద్ధవీరునివలె కనిపిస్తూ అశ్వవాహనంపై ఊరేగుతాడు. వేగానికి అశ్వం ప్రతీక. అనాదిగా అశ్వంవాహనంగా వుంది. ప్రయాణాలకే గాక రథాలకు అశ్వాలను కట్టి నడిపేవారు. చతురంగబలాలలో అత్యంత ప్రధానమైనది అశ్వం. అమృతం కొరకు రాక్షసులు దేవతలు పాలసముద్రాన్ని చిలికినపుడు పాలసముద్రంనుండి ఉచ్చైఃశ్రవం అనుపేరు గల అశ్వరాజం పుట్టింది.

విష్ణుదేవుని అవతారాలు పది ప్రసిద్ధమైనవి గలవు. వాటిలో చివరి అవతారం కల్కిఅవతారం. కలియుగాంతంలో విష్ణుదేవుడు కల్కిరూపం ధరించి, ఖడ్గం చేతబూని అశ్వవాహనారూఢుడై దుష్టజన సంహారం, శిష్టజన సంరక్షణ చేసి ధర్మాన్ని స్థాపిస్తాడని పురాణాలు బోధిస్తున్నాయి.

**కల్కినం తురగారూఢం కలికల్మషనాశనమ్**
**కల్యాణదం కలిఘ్నం చ శ్రీనివాసం భజే ఽ నిశమ్ ॥**

–అశ్వాని ఎక్కినవాడు, భక్తుల కలిదోషాలను హరించువాడు, శుభాల నొసంగువాడు, దుష్టుడయిన కలిపురుషుని నాశనం చేయువాడు, కల్కిభగవానుని రూపంలో అవతరించునట్టి శ్రీనివాసుని ఎల్లప్పుడు సేవించెదను అని దేవశర్మ (ఆదిత్యపురాణం, 3–33) ప్రస్తుతించాడు. శుక్లయజుస్సంహితలో (9–14) అశ్వం రాష్ట్రానికి ప్రతీకగా వర్ణించబడింది. తాళ్ళపాక అన్నమాచార్యులు వేంకటేశ్వరస్వామివారు దేవేరితో తిరువీథులలో ఊరేగుతున్న వైనాన్ని ఇట్లు వర్ణించినాడు.

**వాగెబలుపు దైవపు రాయనీ**
**రాగె జతనము పరాకెచ్చరికె**

**మించుల దురగము మిన్నుల మోవగ**
**నంచల గురచల నాడగను**
**కంచుమించుగా గక్కున దోలితి**
**పంచాస్త్ర గరుడ పాదెచ్చరికె**

**పెక్కున తేజిటు పేరెమువారగ**
**తొక్కని చోట్లు దొక్కగను**
**చుక్కలు మోవగ సొంపుగ దోలితి**
**తొక్కుల దేవ వెచ్చరికె**

**అంకవన్నె పాదాబ్జము పదిలము**
**వేంకటేశ తిరువీథులను**



**సంకె లేక శ్రీసతితో జెలగెడి**
**లంకెల జాగు భళా యెచ్చరికె**

–అన్నమాచార్యసంకీర్తనలు 11–2–30

కలియుగాంతంలో వేంకటేశ్వరస్వామి అశ్వవాహనంమీద కల్కిరూపంలో వచ్చి దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంరక్షణ చేస్తాడని చాటి చెప్పడమే అశ్వవాహనం యొక్కప్రయోజనం. పద్మావతీ శ్రీనివాసుల తొలిచూపుల వేళలో వేంకటేశ్వరుడు అశ్వవాహనారూఢుడైయున్నాడు. విష్ణుదేవుని మరొక అవతారం హయగ్రీవుడు అశ్వముఖుడు. కఠోపనిషత్తు మానవ ఇంద్రియాలను గుర్రాలుగా వర్ణించింది. కనుక గుర్రం నెక్కి ఊరేగుతున్న వేంకటేశ్వరుడు ఇంద్రియ నియామకులమై సాగించాలని వేంకటేశ్వరస్వామి అశ్వవాహనం ద్వారా హితం ఉపదేశిస్తున్నాడు.

## చక్రస్నానం

బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవరోజు ఉదయం పల్లకి ఉత్సవం. తర్వాత శుభముహూర్తంలో చక్రస్నాన మహోత్సవం జరుగుతుంది. పల్లకి ఉత్సవాన్ని అన్నమాచార్యులు

**"తనివార దిరువ నందలముసేవ నేడు**
**అనువుగా సేవించరో అమరులు ఋషులు**

**యెదురుగా గూచుండి యిద్దరు నందలమెక్కి**
**కదిసి మీద చిన్నాము గట్టించి**
**ముదమున నొండొరులు మోములు చూచుకొంటూ**
**యిదివో దేవులు దేవుదేగేరు వీధులు"** సంపు–15–189 పాట

అని పల్లకిలో వేంకటేశ్వరుడు అలమేలుమంగ ఎదురెదురుగా గూరుచుండి ఊరేగుతున్న మనోహర దృశ్యాన్ని రమణీయంగా వర్ణించాడు.

బ్రహ్మోత్సవాలు ఒక యజ్ఞంవలె తొమ్మిదిరోజుల పాటు శ్రద్ధగా, ఘనంగా, వైభవంగా నిర్వహింపబడుతాయి. తొమ్మిదోరోజు వేంకటేశ్వరుని అవతారనక్షత్రమైన శ్రవణంనాడు చక్రస్నానం జరుపబడుతుంది. చక్రస్నానం యజ్ఞాంతంలో ఆచరింపబడే అవభృథస్నానం. యజ్ఞం ముగింపు సందర్భంగా అవభృథస్నానం యజమాని చేయడం సంప్రదాయం. శాస్త్ర విహితం కూడ. అట్లాగే బ్రహ్మోత్సవాలలో చివరి అంశంగా చక్రస్నానం (అవభృథస్నానం) జరుగుతున్నది. ఈ అవభృథ స్నానం ఉత్సవ వైభవాన్ని తరిగొండవెంగమాంబ యిట్లు వర్ణించింది.

"చక్రత్తాళ్వారును, హరిని, శ్రీభూనీళలను (ఇప్పుడు శ్రీవారి వెంట నీళాదేవి కనిపించదు. స్వామికి ఇరువైపులా శ్రీదేవి, భూదేవులే వున్నారు). తిరుచ్చియందు విమాన ప్రదక్షిణంబుగా స్వామిపుష్కరిణీ తీరంబున వేంచేపు సేయించుకొని వచ్చి వరాహస్వామిముందరి మంటపంలో నునిచి, పంచామృత స్నపనంబును (పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు, పసుపులతో అభిషేకం), దిరుమంజనంబును, చక్రస్నాన నైవేద్యక్రమంబులును నాచరించి బ్రహ్మాదులవభృథ స్నానంబులు చేసిరి."

– శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, 2-132

వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులయిన మలయప్పస్వామి, శ్రీదేవి భూదేవులతో పల్లకిలో వరాహస్వామి ఆలయ ప్రాంగణం చేరుకొంటారు. వీరితోపాటు వేరొక పల్లకిలో చక్రత్తాళ్వారు (సుదర్శన చక్రం) వస్తాడు. పిమ్మట దేవతా మూర్తులకు సుదర్శనచక్రానికి స్నపన తిరుమంజనం జరుగుతుంది. మొదట స్వామివారికి, దేవేరులకు స్నానవస్త్రాలు ధరింపజేసి, అర్ఘ్యపాద్యఆచమనాలు జరిపి శుద్ధోదకంతో స్నానం చేయిస్తారు. పిమ్మట



ఆవుపాలతో అభిషేకం, శుద్ధజలంతో అభిషేకం జరుగుతాయి. ధూప, దీప, కర్పూర నీరాజనాలు ఇస్తారు. తర్వాత వరుసగా పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు పసుపుతో అభిషేకం చేస్తారు. వీటితో అభిషేకం చేసిన ప్రతిసారి శుద్ధజలంతో అభిషేకం చేస్తారు. పిమ్మట దేవతామూర్తులకు ధూపదీప నివేదన కర్పూర హారతులు జరుగుతాయి. చివరగా దేవతామూర్తులకు చందనాన్ని అలది, తిలక ధారణ చేసి, తులసిమాలలతో అలంకరిస్తారు. ఆచమనాది క్రియల తర్వాత ధూప దీప హారతులు, కుంభహారతి, నక్షత్రహారతి సమర్పిస్తారు. చివరగా బంగారు పళ్ళెంతో సహస్ర ధారాభిషేకం జరుగుతుంది. ఇట్లు మలయప్పస్వామికి శ్రీదేవి భూదేవులకు, చక్రత్తాళ్వారుకు స్నపన తిరుమంజనం జరుగుచుండగా వేదపండితులు శ్రీసూక్త, పురుషసూక్త, భూసూక్తాలను పఠిస్తారు. అభిషేకం పూర్తికాగానే వేదపఠనం సమాప్తమవుతుంది. పిమ్మట ద్రావిడపండితులు నీరాట్టం పఠిస్తారు. స్వామివారి అభిషేకజలాన్ని అర్చకులు 'పూతోభవ' అని ముందుగా తమమీద చల్లుకొని, పిమ్మట భక్తులందరిమీద చల్లుతారు. తర్వాత దేవతామూర్తులకు వస్త్రాలంకారం చేసి నివేదన చేస్తారు. తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారుకు మాత్రమే స్వామిపుష్కరిణిలో పవిత్రస్నానం (అవభృథం) జరుగుతుంది. ఉత్సవం వేంకటేశ్వర స్వామికి (యజమానికి) అవభృథం చక్రత్తాళ్వారుకు (సేవకునకు) జరుగుచున్నది. కనుక అవభృథానికి చక్రస్నానం అను పేరువచ్చింది.

–వేంకటాచలంలో వైష్ణవధర్మం అతి చిత్రం, ఆశ్చర్యావహం. భవిష్యోత్తరపురాణం బ్రహ్మోత్సవంలో చివరన అవభృథస్నానం వేంకటేశుడే చేసెనని వర్ణించింది.

**"జపద్భిర్వైదికాన్ మంత్రాన్ సహితశ్చ ద్విజోత్తమైః**
**చకారావభృథస్నానం భగవానాదిపూరుషః**

**స్వామిపుష్కరిణీతీర్థే సర్వలోకైకపావనా**
**అవతారదినే తస్మిన్ నక్షత్రే శ్రవణే ప్రగే ”**

–అధ్యా. 14–63, 64శ్లో॥

ఆ సమయంలోనే అర్చకులు, భక్తులందరూ పవిత్ర స్వామిపుష్కరిణిలో స్నానం చేసి పవిత్రులవుతారు. తర్వాత స్వామివారు, దేవేరులు, చక్రత్తాళ్వారు ఊరేగింపుగా వచ్చి ఆలయంలో ప్రవేశిస్తారు.

అవభృథ స్నానానంతరం శ్రీనివాసభగవానుడు

**“శ్రవణంబునందు నా చక్రంబుతో గూడ**
**స్వామిపుష్కరిణిలో స్నానములను**
**సల్పువారలు పూర్వజన్మంబులను జేయు**
**పాపంబులను బాసి భాగ్యవంతు**
**లై యిహపరములయందు సుఖింతురు**
**నా పల్కు నిజముగా నమ్ముడని”**

–శ్రీ వేంకటాచల మాహాత్మ్యము, 2–133

శ్రవణానక్షత్రం నాడు సుదర్శన చక్రంతో గూడ స్వామి పుష్కరిణిలో స్నానం చేసినవారు పూర్వజన్మ పాపాలను తొలగించుకొని, భాగ్యవంతులై ఇహపరలోకాలందు సుఖంగా నామాట నిజం నమ్ముడని భక్తులతో చేయెత్తి పలికినాడు.

## ధ్వజావరోహణం

బ్రహ్మోత్సవాలలో తొమ్మిదవ నాటి రాత్రి ధ్వజావరోహణ ఉత్సవం ఆలయంలో జరుగుతుంది. శ్రీదేవీ భూదేవీ సహిత మలయప్పస్వామి



సమక్షంలో వేదపండితులు వేదం పారాయణ చేయుచుండగా, మంగళవాద్యాలు మ్రోగుచుండగా, భేరీనినాదాలు మార్మోగుచుండగా బ్రహ్మాది దేవతలకు, అష్టదిక్పాలురకు వీడ్కోలు చెప్పుచు గరుడకేతనాన్ని ధ్వజస్తంభం మీద నుండి దించుతారు. ఇట్లు బ్రహ్మోత్సవాలు గరుడకేతనం ఎగురవేయడంతో – బ్రహ్మాది దేవతలను, దిక్పాలురను ఆహ్వానించడంతో ప్రారంభమై గరుడధ్వజం దించి వేయడంతో బ్రహ్మాది దేవతలకు, దిక్పాలురకు వీడ్కోలు చెప్పడంతో పరిసమాప్తమవుతాయి.

బ్రహ్మోత్సవాలు సంపూర్తిఅయిన పిమ్మట శ్రీనివాసభగవానుడు బ్రహ్మాది దేవతలకు, దిక్పాలురకు ప్రీతితో వీడ్కోలు చెప్పుటను అన్నమాచార్యులు ఇట్లు అత్యంతసహజంగా వర్ణించాడు.

**భోగీంద్రులును మీరు బోయి రండు**
**వేగాన మీదటి విభవాలకు**

**హరుడ పోయిరా అజుడ నీవును బోయి**
**తిరిగి రా మీదటి తిరునాళ్ళకు**
**సురలు మునులును భూసురులు బోయిరండు**
**అరవిరి నిన్నాళ్ళు నలసితిరి**

**జముడ పోయిరా, శశియు నీవును బోయి**
**సముఖుడవై రా సురల గూడి**
**గుములై దిక్పతులు దిక్కులకు బోయిరండు**
**ప్రమదాన నిన్నాళ్లు బడలితిరి**

**నారద సనక సనందనాదులు**

**భూరివిభవముల బోయి రండు**

**దూరముగా బోకిట్టే తొరలి వేంకటగిరి**

**జేరి నన్నిట్లనే సేవించుడీ ॥**

ఇట్లు వేంకట విష్ణుదేవుడు దేవతలందరికి వీడ్కోలు పల్కిన తర్వాత భక్తులందరితో ప్రతిసంవత్సరం సూర్యుడు కన్యారాశిలో సంచరించు కన్యామాసంలో ఈ బ్రహ్మోత్సవం ఎవరు చేయించినను నిర్వహించిన వారు ఈ లోకంలో సమస్త భోగాలను అనుభవించి పరమపదాన్ని పొందుతారు. బ్రహ్మోత్సవ దినాలలో అన్నదానం చేయుట పుణ్య కార్యం. అన్నదానం చేసినవారు ఇహపరసుఖాలను పొందుతారు అని బోధించినాడు.

ధ్వజావరోహణం తర్వాత ఉత్సవమూర్తులకు నివేదన, కర్పూర నీరాజనం జరుగుతాయి. తర్వాత అర్చకులకు, ఆచార్యపురుషులకు సత్కారం జరుగుతుంది. పిమ్మట మలయప్పస్వామి శ్రీదేవీ భూదేవీ సమేతుడై రంగనాయకుల మండపం చేరుతారు. ఈ ఉత్సవమూర్తులు బ్రహ్మోత్సవ ప్రారంభంనుండి ఆనందనిలయాన్ని, ధ్రువమూర్తి సన్నిధానాన్ని వీడి దీపావళి వరకు రంగనాయకుల మండపంలో కొలువైవుంటారు.

"..........యమరిన బాణవిద్యల విచిత్రతయు

హరి తిరువీథుల నరిగెడి సొబగు"

అని శ్రేష్ఠలూరి వేంకటార్యుడు 'శ్రీనివాసవిలాససేవధి' అను ద్విపద కావ్యంలో బ్రహ్మోత్సవ వైభవాలను, వేడుకలను వర్ణించాడు. పూర్వం బ్రహ్మోత్సవ వేడుకలలో బాణసంచా కాల్చేవారు. ఈ వేడుక ఇప్పుడు జరుగుట లేదు. ఎట్టూరు తిరుమల కుమార తాతాచార్యులు అను తిరుమల



ఆలయ ఆచార్యపురుషుడు 720 రేఖై పొన్నులు సంవత్సర ఆదాయంగా వచ్చే నాలుగు గ్రామాలను అల్పిశి బ్రహ్మోత్సవాలు, కైశిక ద్వాదశి ఉత్సవం జరిపించడానికి శ్రీభండారానికి దానం చేశాడు. ఇందులో 410 రేఖైపొన్నులు అల్పిశి బ్రహ్మోత్సవం జరిపించడానికి కేటాయించాడు. ఇందులో బాణసంచా కాల్చు వేడుకకు (పెనలిబాణం, ఫైర్‌వర్క్స్) 20 రేఖైపొన్నులు కేటాయించాడు. చూడు: దానశాసనం 6-5, తేది: 25-9-1583, తిరుమల తిరుపతి దేవస్థానం శాసనాలు, 1998. ఈ శాసనం తిరుమల ఆలయం మూడవ ప్రాకారం దక్షిణపు గోడపై చెక్కబడి యున్నది.

బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం ఆరుగంటలకు - రాత్రి ఉత్సవానికి ముందు - తిరుమల ఆలయం వెలుపల ఆగ్నేయదిశలోవున్న కొలువుమండపంలో సహస్రదీపాలంకరణల మధ్య దేవేరీసహితుడైన మలయప్పస్వామికి ఉయ్యాలసేవ జరుగుతుంది. సహస్రదీపాలమధ్య స్వామివారు దేవేరులతో కూడి ఉయ్యాలలూగుతూ, వింతవింత కాంతులతో ప్రకాశిస్తూ భక్తజనానికి కన్నులపండువుగ దర్శనమిస్తాడు.

## పుష్పయాగం

పూర్వం బ్రహ్మోత్సవం తొమ్మిదిరోజులు జరిగిన తర్వాత పదవరోజు పగలు, బ్రహ్మోత్సవంలో తెలిసీతెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించేవారు.

**ధ్వజారోహణతీర్థాంత ప్రాయశ్చిత్తం తు యద్భవేత్**

**తస్య దోషవిఘాతార్థం పుష్పయాగం చ కారయేత్ ॥**

-ఉత్సవంలో ధ్వజారోహణం నుండి అవభృథస్నానం వరకు జరుపబడిన కార్యాలలో లోపాలు, దోషాలు గలుగవచ్చును. కనుక ఆ

దోషనివారణార్థం పుష్పయాగం చేయవలెనని కపింజల సంహిత పుష్పయాగం ఆవశ్యకతను వివరించింది. ఇప్పుడు చక్రస్నానం దోషపరిహారం కోసం మరుసటి నెలలో అనగా కార్తికమాసం శ్రవణనక్షత్రంనాడు పుష్పయాగం నిర్వహింపబడుతున్నది. దోష పరిహారార్థం శ్రావణశుద్ధదశమి నుండి నాలుగు రోజులు పవిత్రోత్సవాలు జరుపబడుతున్నవి.

**అంత వైఖానసులా యుత్సవమున**
**నంతరాయముల బ్రాయశ్చిత్తము గను**
**శ్రీనివాసులకు విశేషార్చనములు**
**జానూరు కటినాభి సద్వత్సబాహు**
**గళముఖ మౌళ్యంత కలితక్రమమున**
**దలప బద్మాదిక దశవిధార్చనలు**
**గావించి నల్దెస క్రమమున నిల్పి**
**భావించి సూత్రోక్తపరిపాటి సల్పు**
**పుష్పయాగంబెంత బొలుపొందెనపుడు**
**పుష్పవర్షము నభోభూజముల్ గురియ"**

-శ్రీనివాస విలాససేవధి, 6-1141-1150 పంక్తులు

అని శ్రేష్ఠలూరి వేంకటార్యుడు పుష్పయాగోత్సవాన్ని వర్ణించినాడు అన్నమాచార్యులు పుష్పయాగ వైభవాన్ని

**"సకలలోకేశ్వరుడు సరుస జేకొనువాడు**
**అకలంకముగ బుష్పయాగంబు**



**వివిధపుష్పములతో వేదఘోషములతో**
**ఆవల దిరువాముడియు నంగనల యాటతో**
**కవి వందినుతులతో కమ్మ బూజలతోడ**
**నవధరించీ బుష్పయాగంబు**

**కపురంపుటారతుల ఘనచందనముతోడ**
**తెప్పలధూపముల తిరువందికాపుతో**
**వొప్పగ బణ్యారములు వగి బెక్కువగలతో**
**అప్పడందీ బుష్పయాగంబు."**

సాంగోపాంగంగా వర్ణించాడు. పుష్పయాగంలో స్వామిని వివిధ రంగుల పుష్పాలతో పూజించడంతోబాటు, వేదపఠనం, తిరువాయ్‌ముడి పఠనం, దేవదాసీల నృత్యాలు, గాయకుల సంకీర్తనలగానం, వివిధరకాలైన నివేదనలు వుండేవి. అనేక బ్రహ్మోత్సవాలతో పాటు పుష్పయాగోత్సవం కూడ క్రీ.శ. 17వ శతాబ్దం నుండి నిలిచిపోయి యుండును. తి.తి.దేవస్థానంవారు 14-11-1980 నుండి బ్రహ్మోత్సవానంతరం గాక కార్తికమాసంలో శ్రవణానక్షత్రంనాడు పుష్పయాగాన్ని పునరుద్ధరించి ఘనంగా వైభవంగా నిర్వహిస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు తిరుమలకు వచ్చిన యాత్రికులకు ధనవంతులైన తిరుమలవాసులు, దాతలు అయిన భక్తులు చేసే సౌకర్యాలను, అతిథి మర్యాదలను క్రీ.శ. 17 శతాబ్దంలో జీవించిన గణపవరపు వేంకటకవి తన 'ప్రబంధరాజవిజయవేంకటేశ్వరవిలాసము' అనుప్రబంధంలో ఇట్లు వర్ణించాడు.

**బడలినవారికి వడపప్పు పానకా**
**లనటి పండ్లోపిన యన్ని గలవు**

**యెళనీరు బిసనీరు లెందు హేరాళంబు**
**నీరు చల్లబెరు గపార మచట**
**గప్పూర గంధంబు కైరవల్పట్టీలు**
**తట్టుపునుంగును జుట్టు పూవు**
**లెందు వేడిన వెల్లయే చప్పరంబున**
**విప్పైన గొడుగులు విసనకఱ్ఱ**

**లేలకులు శొంఠియును లవంగాలు పనస**
**తొలలు చెరకులు ఖర్జూరఫలము లెన్ని**
**వేడినను గొండనుచు జాటు వేంకటేశు**
**భక్తజాలంబు తిరునాళ్ళ ప్రజలకు నపుడు.**

శ్రీవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలకు తిరుమలకు వచ్చిన యాత్రికులకు తిరుమల నివాసులు, వేంకటేశ్వరుని భక్తులు నీటి చలివేంద్రలు, మజ్జిగ చలివేంద్రులు, అన్న సత్రాలు ఏర్పరచి మాధవునిపై భక్తితో మానవ సేవ చేస్తుండేవారు. ఇది క్రీ.శ. 17వ శతాబ్దంనాటి అతిథిమర్యాద. నేడు 21 శతాబ్దం నడుస్తున్నది. ప్రస్తుతం తిరుమల ప్రజలు గాక తిరుమల తిరుపతి దేవస్థానంవారు యాత్రికులకు యథాశక్తి సేవలు చేస్తున్నారు. ఉత్సవాలకు, దర్శనానికి వచ్చిన యాత్రికుల ఆలనపాలన వేంకటేశ్వరుడే చూస్తున్నాడు!

శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలను కనులారచూచి తరించిన భక్తజనులు

**వేంకటాద్రికి నుద్ది విష్ణుస్థలంబు**
**వేంకటేశ్వరు బోలు వేరె దైవతము**



**సత్యంబుగాగ నెచ్చట లేదు లేదు**
**ప్రత్యక్షముగ నుమాపతి సాక్షి యిందు**

అని ఎలుగెత్తి చాటేవారు. భక్తజనప్రియుడు, ఆశ్రితజనకల్ప వృక్షమయిన వేంకటేశ్వరస్వామికి

**అభివాదనము వృషభాఖ్యమహాహార్య**
**నవ్య కూటాగ్ర వాస్తవ్యునకును**
**దండంబు గరుణాభిధాన శైలమణీ వి**
**భాసమాన స్వర్ణభవనభర్త**
**కంజలి శేషనామాధిక్య ధరణీధ**
**రాదిత్యకా గృహమేధిమణికి**
**వినతిశ్రీ వేంకట విఖ్యాతనామధే**
**యాచల హేమగేహకులపతికి**

**చిన్ని పూవంజనాద్రి ప్రసిద్ధ నిధికి**
**శరణు గుహ సరసీకేళి సక్తమతికి**
**మోద్పుగేలు త్రిమూర్తుల మొదలి దొరకు**
**వెండియు జోహారు వినతవేదండునకును**

–వృషభాచలంలో నివసించువానికి నమస్కారం! కరుణాద్రియను పేరు గలిగిన పర్వతమందున్న స్వర్ణమందిరాధిపతికి నమస్కారం! శేషాచలమందు నివసించియున్న గృహస్థునకు నమస్కారం! వేంకటాద్రియందున్న బంగారుగృహం ఆనంద నిలయంలో – నివసించువానికి నమస్కారం! అంజనాద్రి యందున్న కల్పనిధికి నమస్కారం! కుమారధారా తీర్థంలో

క్రీడించుట యందు ఆసక్తి గలవానికి నమస్కారం! త్రిమూర్తులకు మూలమైన దేవరకు నమస్కారం! గజేంద్రు రక్షకునకు నమస్కారం! అని ఏటికోళ్ళు – గోత్రనామాలు (ప్రవర) చెప్పి, పాదాలు సోకమ్రొక్కుట – చేసి తిరుమలదేవర నుండి వీడ్కోలు దీసికొని, స్వామి దర్శనంచేత సంతోషభరిత హృదయులై స్వగృహాలకు మరలి వెళ్ళేవారు.

**అస్తి కల్పద్రుమః కోపి జాతరూపలతావృతః**
**వేంకటాద్రిశిఖారూఢః స్మర్యతాం పరమార్థదః**